RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 225 మేడ్చల్ మల్కాజ్‌గిరి 6 సెప్టెంబర్ 2024 శుక్రవారం పేజీలు : 4

## ఢిల్లీలో డ్రగ్స్ కలకలం.. 944 మంది అదుపులోకి

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో డ్రగ్స్ కలకలం రేపాయి. నగరంలో పెద్ద ఎత్తున డ్రగ్స్ విక్రయం, వినియోగం జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు 325 ప్రదేశాల్లో దాడులు నిర్వహించి.. ఏకంగా 944 మందిని అదుపులోకి తీసుకున్నారు. గత సాయంత్రం 4 గంటల నుంచి తెల్లవారుజాము 4 గంటల వరకు ఏకధాటిగా 12 గంటలపాటు ఈ దాడులు కొనసాగాయి. ఢిల్లీ అదనపు పోలీస్ కమిషనర్ సంజయ్ భాటియా నేతృత్వంలో నిర్వహించిన ఈ దాడుల్లో 108.93 గ్రాముల హెరాయిన్, 66.28 కిలోల గంజాయితోపాటు 1100 గ్రామాలు చరస్, 16 గ్రాముల ఎండీఎంఏ పట్టుబడ్డాయి.




## భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎదురుకాల్పులు.. ఆరుగురు మావోయిస్టుల మృతి

కరకగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. కరకగూడెం మండలం రఘునాథపాలెం సమీపంలోని అటవీ ప్రాంతంలో పోలీసులు-మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి.

మృతుల్లో మణుగూరు ఏరియా కమిటీ కార్యదర్శి లచ్చన్న సహా ఆయన దళానికి చెందిన ఆరుగురు ఉన్నట్లు గుర్తించారు. ఈ కాల్పుల్లో గ్రేహౌండ్ కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలయ్యాయి. రఘునాథపాలెం ప్రాంతంలో గత కొంతకాలంగా ఈ దళం కార్యకలాపాలు కొనసాగిస్తోంది. ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన ఈ దళానికి లచ్చన్న నాయకత్వం వహిస్తున్నారు. మృతుల్లో లచ్చన్నతో పాటు తులసి, శుక్రాం, రాము, దుర్గేష్, కోసి ఉన్నట్లు గుర్తించారు.

## రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్: డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్: గురువులకు ఈ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 41 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మొత్తం 27,862 ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో వరదల సమస్యల వల్ల సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోయారని తెలిపారు. "ప్రస్తుత కంపెనీల అవసరాలకు అనుగుణంగా మన విద్యావ్యవస్థ లేదు. మన రాష్ట్ర విద్యా వ్యవస్థ ఇంకా మారాల్సి ఉంది. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకే నైపుణ్య యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలోని ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నాం. రాష్ట్ర విద్యార్థులు అంతర్జాతీయంగా పోటీ పడేలా తీర్చిదిద్దాలని భావిస్తున్నాం. సమాజాన్ని సన్మార్గంలో పెట్టడంలో గురువులది కీలకపాత్ర. అదృష్టం కొద్దీ మన రాష్ట్రంలో ఆదర్శమైన గురువులు ఉన్నారు. ప్రభుత్వ నిర్ణయాలను మన గురువులు చక్కగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసినప్పుడు చక్కగా సహకరించారు. గురువులు ఎంత గొప్ప వాళ్లైతే సమాజం కూడా అంత గొప్పగా మారుతుంది"అని భట్టి విక్రమార్క అన్నారు.

# రేవంత్‌కు అండగా అధిష్టానం!





## హైడ్రా కూల్చివేతలు.. రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ సపోర్టు!

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన హైడ్రా అక్రమార్కుల గుండెల్లో వణుకుపుట్టిస్తోంది.ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్న విషయం తెలిసిందే. హైదరాబాద్ మహానగర పరిధిలోని చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలపై హైడ్రా కన్నెర్ర చేస్తోంది. ఈ క్రమంలోనే పలువురు రాజకీయ నాయకుల అక్రమ కట్టడాలపై కూడా హైడ్రా చర్యలు తీసుకోవడంతో పలువురు ఏఐసీసీ పెద్దలకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే, రాహుల్ గాంధీ మాత్రం సీఎం రేవంత్ రెడ్డికి సపోర్టుగా నిలిచినట్లు కథనాలు వస్తున్నాయి. ఇటీవల కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్రమంత్రి పల్లం రాజు సోదరుడికి చెందిన ఓఆర్వో స్పోర్ట్స్ కాంప్లెక్స్ హిమాయత్ సాగర్ ఎఫ్టీఎల్‌లో ఉందని హైడ్రా అధికారులు కూల్చేశారు. ఈ విషయంపై మాజీ కేంద్రమంత్రి పల్లం రాజు నేరుగా రాహుల్‌కు ఫిర్యాదు చేయడమే కాకుండా తన అసంతృప్తిని సైతం వెల్లగక్కినట్లు తెలిసింది. అయితే, రాహుల్ గాంధీ మాత్రం రేవంత్ రెడ్డికి ఫుల్ సపోర్టుగా నిలిచారని, అక్రమ కట్టడాలు ఎవరివి అయినా ముందుకు వెళ్లాలని సూచించినట్లు గాంధీ భవన్ వర్గాలు పేర్కొంటున్నాయి.

## ఖమ్మం వరదల్లో సుభాన్ హీరో.. ప్రభుత్వం జీరో : మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి





హైదరాబాద్ : పక్క రాష్ట్రం నుండి వచ్చిన రోజు కూలీ, జేసీబీ డ్రైవర్ సుభాన్ 9 మందిని కాపాడి హీరో అయ్యాడు.. ముగ్గురు మంత్రులు, ప్రభుత్వం జీరో అయ్యారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం వరదలను పట్టించుకోలేదని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర కేబినెట్‌లో మిగిలిన ఆరు మంత్రి పదవులు ఎప్పుడు భర్తీ చేస్తారో తెలియదు. భర్తీ చేసినప్పుడు సుభాన్ లాంటి ఒక దృఢమైన వ్యక్తిని మంత్రిగా పెట్టుకోండి.. ప్రజలకు ధైర్యాన్ని ఇస్తారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజులు వరదల గురించి పట్టించుకోలేదు. మూడోరోజు తీరిగ్గా పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేతను విమర్శించడం సిగ్గుచేటు. వరద బాధితులకు సాయం గురించి అధికారులతో సమావేశం పెట్టి ప్రతిపక్షాన్ని నిందించడం ఏమిటి? కేసీఆర్ కనిపించడం లేదని చెప్పడం ఆశ్చర్యకరం. కేసీఆర్ వ్యక్తి కాదు.. కేసీఆర్ ఒక వ్యవస్థ. తెలంగాణ ప్రతి అభివృద్ధిలో, నీళ్లలో, పంటలలో కేసీఆర్ ఉంటారని నిరంజన్ రెడ్డి తెలిపారు. ఖమ్మంలో క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు, నేతలు ప్రజలకు సాయం చేయడంలో ముందున్నారు.. అది మానవీయ కోణంలో చేస్తున్న పని.. వరద బాధితులకు అండగా పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయి. ప్రభుత్వాలు మానవీయ దృక్పదంతో పనిచేయాలి. దురదృష్టవశాత్తు ఈ ప్రభుత్వానికి ఆ కోణం లేదు. వరదల గురించి వాతావరణ శాఖ సూచనలను ప్రభుత్వం పట్టించుకోలేదు. రైతులు పొలాలకు మందు కొట్టే విషయంలో కూడా ముందుచూపుతో వ్యవహరిస్తారు. వరద బాధితులు హాహాకారాలు చేస్తుంటే.. మంత్రులు, సీఎం తలోరకంగా మాట్లాడుతున్నారు. ముగ్గురు మంత్రులు విఫలమయ్యారని ప్రజలే చెబుతున్నారు .. ప్రజలు మీకు నవరంధ్రాలలో ఏం పోస్తున్నారో సీఎం గమనించాలి. హైదరాబాద్ నుండి కదలకుండానే సీఎం వరద ప్రాంతాలను పీఎం సందర్శించాలని చెప్పడం ఆశ్చ్యర్యకరమని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీ అమలుకాక ప్రజలు బాధపడుతున్నారు. రుణమాఫీ విషయంలో మంత్రులకే స్పష్టత లేదు. మంత్రులు హెలికాప్టర్ లేదని చెప్పడం దురదృష్టకరం. ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక, చిత్తశుద్ధి లేకనే వరదల్లో ప్రజలు నష్టపోయారు. వరదల్లో చనిపోయిన వారికి రూ.5 లక్షలు గతంలో ఉన్నదే.. గతంలో రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసిన రేవంత్ ఇప్పుడు దానిని అమలు చేయాలి.

రేవంత్ ప్రతిపక్షంలో ఒకమాట.. అధికారం దక్కిన తర్వాత ఒకమాట మాట్లాడుతున్నాడు. రాష్ట్రంలో 18 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది.. రైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలి. కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్‌లో రాష్ట్రానికి రాసిన లేఖలో రూ.1300 కోట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపింది.. క్షేత్రస్థాయికి సంబంధించిన సమాచారం రాష్ట్రం పంపలేదని స్పష్టం చేసిందని నిరంజన్ రెడ్డి తెలిపారు.



## విప్లవాత్మక మార్పులకు హైదరాబాద్‌లా ఏ నగరమూ సిద్ధంగా లేదు: సీఎం రేవంత్

హైదరాబాద్: సరికొత్త ఆవిష్కరణలు ప్రపంచాన్ని మార్చాయ ని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నేటి తరం అద్భుత ఆవిష్కరణ ఏఐ అని కొనియాడారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో రాష్ట్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్లోబల్ ఏఐ' సదస్సుకు సీఎం ముఖ్యఅ తిథిగా హాజరయ్యారు. హైదరాబాద్‌లో జీపీయూ ఆధారిత ఏఐ క్లౌడ్ ఏర్పాటులో భాగస్వామ్యంలో సదస్సులో చర్చించారు.

ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడారు. "కొత్త ఆవిష్కరణలు ప్రజల జీవితాల్లో మార్పులు తెస్తాయి. అవి ఆశలతో పాటు భయాన్నీ తీసుకొస్తాయి. విప్లవాత్మక మార్పులకు హైదరాబాద్ మాదిరిగా ఏ నగరమూ సిద్ధంగా లేదు. ఏఐ ద్వారా భవిష్యత్తుకు బలమైన పునాది వేశాం. నాస్కామ్ సహకారం తో ఏఐ ఫ్రేమ్ వర్క్‌కు రూపకల్పన జరుగుతుంది. ఆవిష్కరణ లకు పారిశ్రామిక నిపుణులతో రాష్ట్ర ప్రభుత్వం కలిసి పనిచేస్తోంది. అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును ఆవిష్కరిద్దాం.

## విద్యా వ్యవస్థ ఇంకా బలోపేతం కావాలి



సిద్దిపేట జిల్లా: విద్యావ్యవస్థ ఇంకా బలోపేతం కావాలని మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీసీ భవనంలో గురుపూజోత్సవం సందర్భంగా ఈరోజు(గురువారం) జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో హరీష్?రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ... సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన సందర్భంగా గురు పుజోత్సవం జరుపుకుంటారని తెలిపారు. ఈ గురువులు అందరికీ గురు పుజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులకు సమాజంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉందని వివరించారు. ఎవరికి దొరకని గౌరవం ఓక ఉపాధ్యాయునికి దొరుకుతుందని అన్నారు. సిద్దిపేట జిల్లా ఉపాధ్యాయులు ఎప్పుడు సిద్దిపేట గౌరవాన్ని కాపాడారని చెప్పారు. రాష్ట్రంలో పదోతరగతి ఫలితాల్లో సిద్దిపేటను రెండో స్థానంలో ఉపాధ్యాయులు నిలిపారని ప్రశంసించారు.

రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా ట్రిబుల్ ఐటీలో మొదటిస్థానంలో ఉందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ తెలంగాణలోని పాఠశాల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెట్టారని చెప్పారు. 'మన ఊరు - మన బడి' పథకంలో ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యా ప్రారంభించామని తెలిపారు. 'మన ఊరు - మన బడి' పనులను కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యలోనే ఆపేసిందని ఆరోపణలు చేశారు.రాష్ట్రంలో 1700 ప్రభుత్వ పాఠశాలలు ఈ విద్యా సంవత్సరం మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఉపాధ్యాయులకు సంబంధించిన నాలుగు డీఏలు ఇంకా పెండింగ్‌లో ఉన్నామని..వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాల్లో ఉచిత కరెంటు లేదని.. స్కవెంజరులు లేరని చెప్పారు.

విద్యా వలంటీర్లు, ఉపాధ్యాయులు లేక పాఠశాలలు మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని తీసివేతలు, ఏరివేతలు కోతలు పెడుతున్నారని ఆరోపణలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో విద్యా నిలయంగా సిద్దిపేటను మార్చుకున్నామని చెప్పారు. సిద్దిపేట ప్రజలు అన్ని చదువులు చదవాలని అన్ని కోర్సులు అందుబాటులోకి తెచ్చినట్లు హరీష్‌రావు వెల్లడించారు.

# సంపాదకీయం

## ట్వీట్ల మోతకు బదులు అమెరికా నుంచి వచ్చేయొచ్చుగా కేటీఆర్?

అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. విపక్షంలోకి ఉన్నప్పుడు మరోలా వ్యవహరిస్తే ప్రజలు హర్షించరన్న ప్రాథమిక అంశాన్నిమాజీ మంత్రి కేటీఆర్ ఎప్పటికి గుర్తిస్తారు? అన్నది ప్రశ్నగా మారింది. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు.. తన తండ్రి ప్రభుత్వంలో తిరుగులేని అధికారాన్ని చెలాయించిన కేటీఆర్.. అప్పట్లో తాను ఎలా వ్యవహరించానన్న విషయాన్ని ఎప్పటికి గుర్తుకు తెచ్చుకుంటారు? ఇవాల్టి రోజున ప్రభుత్వం చేసే ప్రతి పనిలోనూ వేలెత్తి చూపించటం.. విమర్శలు చేయటం బాగానే ఉన్నా.. ఇదెంతవరకు సబబు? అన్నది పెద్ద ప్రశ్నగా మారింది. కారణం.. ఆయన వేలెత్తి చూపించే చాలా అంశాల్లో తాము అధికారంలో ఉన్నప్పుడు ఎలా వ్యవహరించామన్న విషయం ఆయనకు గుర్తుకు లేకపోవచ్చు కానీ.. ప్రజలు మర్చిపోలేన్న లాజిక్ ను కేటీఆర్ ఎలా మిస్ అవుతున్నారన్నది అర్థం కానిది. ప్రజల తరఫున పోరాటం చేయటమంటే.. వారి ఆశల్ని.. ఆకాంక్షల్ని గుర్తించి.. వాటికి తగినట్లుగా తనను మార్చుకోవాల్సిన అవసరం ఉంది. అదేమీ లేకుండా.. ప్రతి అంశాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవాలన్న తొందర చూసినప్పుడు చిన్నపిల్లాడు కోరుకున్న చాక్లెట్ దొరక్కపోతే చేసే అల్లరి మాదిరి కేటీఆర్ తీరు ఉందన్న వ్యాఖ్య వినిపిస్తోంది. ఖమ్మం వరదల విషయానికే వస్తే.. రేవంత్ సర్కారు వేగంగా స్పందించిందనే చెప్పాలి. దీనికి కారణం.. ఇష్యూ తెర మీదకు వచ్చిన రెండో రోజు నుంచి ఖమ్మంలోనే ఉండిపోయిన ముఖ్యమంత్రి మూడు రోజులుగా అక్కడే ఉండటం చూస్తున్నదే. సహాయక చర్యల్ని మరింత వేగంగా నడిపించేందుకు ప్రయత్నిస్తున్నారు. బాధితుల్ని కలవటం.. వారిని ఓదార్చటంతో పాటు.. కొన్ని అంశాల్లో అప్పటికప్పుడు నిర్ణయాలను చకచకా తీసుకొని.. ప్రత్యర్థులకు ఏ మాత్రం అవకాశం ఇవ్వట్లేదు ముఖ్యమంత్రి రేవంత్. ఇలాంటి పరిస్థితుల్లో విషయాల్ని గమనిస్తూ.. కాస్తంత మౌనాన్ని ప్రదర్శించటం ద్వారా ప్రజలకు తమను తలుచుకునేలా చేయాల్సి ఉంటుంది. అందుకు భిన్నంగా ప్రతి చిన్న విషయానికి.. చితక విషయానికి తగదునమ్మా అన్నట్లు స్పందించటంలో అర్థం లేదని చెప్పాలి. ఖమ్మం వరదల వేళ.. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలతో పాటు.. సద్విమర్శ. అదే సమయంలో బాధ్యత కలగిన ప్రధాన ప్రతిపక్షంగా వ్యవహరించటం. నిద్ర లేచింది మొదలు రేవంత్ ప్రభుత్వాన్ని తూర్పార పట్టే కేటీఆర్.. తమ వరకు జరిగే తప్పుల్నిచూసుకోరా? అన్నది ప్రశ్న. ఖమ్మం వరదల వేళ.. బాధితుల్ని పరామర్శించాల్సిన బాధ్యత ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ మీద లేదా? అంతదాకా ఎందుకు? అక్కడెక్కడో అమెరికాలో ఉండి..ట్వీట్లు చేసే కన్నా.. వెంటనే తన యాత్రను మధ్యలో ఆపేసి తిరిగి వచ్చేయొచ్చు కదా? ఖమ్మం ప్రజానీకానికి గొంతులా మారి.. ప్రభుత్వం వైఫల్యం చెందిన అంశాల్ని ఎత్తి చూపి..వాటి పరిష్కారాల్ని ప్రస్తావిస్తే బాగుంటుంది. అలాంటిదేమీ లేకుండా.. ప్రతి అంశానికి అవసరానికి మించి స్పందించటం మంచిది కాదన్నది మర్చిపోకూడదు. ట్వీట్లతో అది జరగ లేదు.. ఇది జరగలేదన్నట్లుగా చెలరేగిపోతే.. ముఖ్యమంత్రి రేవంత్ అన్నట్లు ట్విట్టర్ టిల్లుగానే మిగులుతారు కానీ ప్రజానేతగా ప్రజల్లో నమోదు కారన్న విషయాన్ని ఎప్పటికి గుర్తిస్తారు?

## ఉపాధ్యాయులు రేపటి భావితరాలకు మార్గదర్శకులు...

### మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతం





జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : ఉపాధ్యాయుల ప్రాముఖ్యత విద్యార్థులకే కాకుండా, అందరికి తెలియాలనే ఉద్దేశ్యంతోనే గురు పూజోత్సవాన్ని జరుపుకుంటారని, విద్యార్థులకు ఆదర్శవంతంగా ఉండేలా ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని మేడ్చేల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం తెలిపారు. గురువారం మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ గౌతం విచ్చేసి జ్యోతి ప్రజ్వలన గావించి, డా.సర్వేపల్లిరాధాకృష్ణ గారి చిత్రపటానికి పూలమాల వేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండి వారికి నచ్చిన ఉపాధ్యాయులను రోల్ మోడల్ గా భావించి వారి భాష, ఆహార్యాన్ని, నడవడికను అనుసరిస్తూ ఉంటారని, అందుకే ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆదర్శవంతంగా ఉండేలా వ్యవహారించాలని కలెక్టర్ అన్నారు. గురువు యొక్క ప్రాముఖ్యతను అందరికి తెలియజేయడానికే ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటా మన్నారు. ఉపాధ్యాయ వృత్తి మీద సమాజం ఆధారపడి ఉంటుందని, విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దితేనే సమాజం బాగుంటుందని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్ పాఠశాలల ఉపాధ్యాయుల ద్వారా లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలని, మీరు ఇచ్చే ఫలితాలు ర్యాంకులతోనే మార్కులతోనో కాకుండా వారి జీవితాలను మౌల్డ్ చేసేలా ఉండాలని కలెక్టర్ అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులకు అందించే అవార్డులు కొలమానం కాదని, టీచర్లందరు ఉత్సాహంగా విధులు నిర్వహిస్తూ పిల్లలను ఇన్ స్పైర్ చేయాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ ముందుగా అందరికి గురుపూజా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.మేడ్చేల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దడంలో టీచర్ యొక్క ప్రధానమైన పాత్ర ఉంటుందన్నారు. అత్యంత గౌరవ ప్రదమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని అదనపు కలెక్టర్ అభిప్రాయపడ్డారు. జిల్లా విద్యాశాఖాధికారి విజయ కుమారి జిల్లా కలెక్టర్ కు, అదనపు కలెక్టరుకు జ్ఞాపికను అందజేసారు. ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను మెమోంటోతో కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

## 13 సంవత్సరాల గడిచినప్పటికీ బండి రాఘవరెడ్డి దొర పై గ్రామస్తుల్లో అదే గౌరవం...

### కీ.శే.మాజీ సర్పంచ్ బండి రాఘవరెడ్డి ఘనంగా 13వ వర్ధంతి వేడుకలు





శామీర్ పేట (గరుడ వార్త) : అలియాబాద్ గ్రామస్తులు మా దొర అంటూ గౌరవంగా పిలుచుకునే అలియాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ కీ.శే. బండి రాఘవరెడ్డి 13వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. గురువారం శామీర్ పేట మండలం అలియాబాద్ గ్రామంలో ఆయన విగ్రహానికి పులమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ... గతంలో సుదీర్ఘకాలం మజీద్ పూర్, అలియాబాద్ గ్రామాలకు 15 సంవత్సరాలు సర్పంచ్ గా సేవలందించారని, లాభాపేక్ష, నిస్వార్థంగా రెండు గ్రామాల్లో అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి సారథ్యంలో కూడు, గుడును కల్పించారని తెలిపారు. పలువురి పేదలకు వివాహాలు జరిపించిన మహా నేత అని కొనియాడారు. గ్రామాల అభివృద్దే లక్ష్యంగా నిరంతరంగా పనిచేశా రని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ సర్పంచ్లు, ఉప సర్పంచ్ లు, గ్రామానికి చెందిన నాయకులు, యువకులు తదితరు లు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి పథకాలు నిర్ణీత గడువుల్లోగా లక్ష్యాలను సాధించాలి

### మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతం



జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : ఇందిరా మహిళ శక్తి లో పథకాలను నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను సాధించి లబ్దిదారులకు లబ్ది చేకూరేలా చర్యలు తీసుకవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారులను మేడ్చేల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం ఆదేశించారు. గురువారం ఇందిరమ్మ మహిళా శక్తి కార్యక్రమాలలో భాగంగారాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న 12 అంశాల పై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక బృందాల ద్వారా మహిళా సంఘాల సభ్యులు, సాధారణ పెట్టుబడి సమూహాలు, సూక్ష్మ సంస్థలు ద్వారా 7 కొత్తయూనిట్లైన బ్యూటిషియన్, మైక్ అండ్ లైటింగ్, డెకరేషన్, ఫుడ్ క్యాంటీన్, ఫోటోగ్రఫి, ఈవెంట్ మేనేజ్మెంట్, కన్స్ట్రక్షన్ యూనిట్ల టార్గట్ల గ్రౌండింగ్ పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈయూనిట్ల ను కలిపి గ్రూపులుగా ఏర్పాటు చేసి గ్రూప్ టార్గెట్లను పూర్తి చేయాల న్నారు. వీటిలో ఫుడ్ క్యాంటీన్లకు స్థలం సమస్య ఉన్నట్లయితే మొబైల్ ఫుడ్ కోర్టులను తీసుకోవాలన్నారు. ఈ పనులన్నింటిని నవంబరు చివరి నాటికి పూర్తి చేయాలని కలెక్టరు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ అధికారి సాంబశివరావు, మెప్మా పిడి, సంబంధిత పాల్గొన్నారు.



## గణేష్ నిమజ్జనాల ఏర్పాట్లను పరిశీలించిన ...

### శామీర్పేట సీఐ తదితర సంబంధిత శాఖల అధికారులు

శామీర్ పేట, (గరుడ వార్త) : గణేష్ నిమజ్జనాల ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులతో కలిసి శామీర్పేట సీఐ శ్రీనాథ్ పర్యవేక్షించారు. గురువారం శామీర్ పేట పెద్ద చెరువు వద్ద ఏర్పాటు చేస్తున్న గణేష్ నిమజ్జనాల ప్లాట్ ఫామ్ ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులు సందర్శించి పరిశీలించారు. గణేష్ నిమజ్జనాలను వివిధ శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని మేడ్చల్ ట్రాఫిక్ ఏసిపి వెంకట్ రెడ్డి కోరారు. శామీర్ పేట పెద్ద చెరువులో గణేష్ విగ్రహాలను ఉత్సవాల కమిటీ నిర్వహాకులు ఇబ్బందులు లేకుండా నిమజ్జనాలు చేసేందుకై అవ



సరమైన ఏర్పాట్లను బాధ్యతగా నిర్వర్తించాలని ఏసీపీ వివిధ శాఖల అధికారులను కోరారు. అనంతరం గణేష్ నిమజ్జన ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మమతబాయి, శామీర్ పేట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్, మేడ్చల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్, తూంకుంట మున్సిపల్ కమీషనర్ వెంకటగోపాల్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు పై వేటు

శామీర్ పేట (గరుడ వార్త) : ప్రభుత్వ నియమనిబంధనల ఉల్లంఘిస్తూ అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలను చేపడితే సహించేది లేదని టిపిఓ మణిహారిక హెచ్చరించారు. గురువారం తూముకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ ఆదేశానుసారం మున్సిపల్ పరిధిలోని దేవాలయంజాల్ లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న గోదామును జెసిబి యంత్రం తో కూల్చివేశారు. ఈ




సందర్భంగా టిపిఓ మణిహారిక మాట్లాడుతూ అక్రమంగ నిర్మిస్తున్న గోదాముపై స్థానికులు మున్సిపల్ అధికారులకు పిర్యాదు చేశారని తెలిపారు. దీంతో మున్సిపల్ కమిషనర్ ఆదేశానుసారం కూల్చివేసినట్లు చెప్పారు. అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టిన, వారు ఎంతటి వారైనా సరే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిత్యం రక్తసిక్తం..!

సూర్యాపేట : జాతీయ, ప్రధాన రహదారులు నిత్యం రక్తమోడుతున్నాయి. వాహనాల అతివేగం, చోదకుల నిర్లక్ష్యం అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నాయి. ఒక్కరు చేసిన పాపానికి ఎందరో తనువు చాలిస్తున్నారు. తల్లిదండ్రులకు ఆసరా అవుతారనుకున్న కుమారులు దూరమై పుట్టెడు శోకాన్ని మిగులుస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో రోజూ ఎక్కడో చోట రహదారి ప్రమాదం జరుగుతూనే ఉంది. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా జనవరి నుంచి ఏప్రిల్ 11 వరకు 102 రోజుల వ్యవధిలోనే 91 మంది మృత్యువాత పడినట్లు పోలీసుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సూర్యాపేట పురపాలిక పరిధిలో ఈ నెల 4 నుంచి 11 వరకు తొమ్మిది రోజుల వ్యవధిలో జరిగిన వేర్వేరుగా రోడ్డు ప్రమాదాల్లో 13 మంది దుర్మరణం చెందడం విస్మయం కలిగిస్తోంది. ప్రధానంగా వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం, అతివేగం వల్ల జరిగిన ప్రమాదాలే ఎక్కువ.

ఈ నెలలో జరిగిన దుర్ఘటనలు ఇవీ..

ఈ నెల 3న కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామం బస్టాండ్ సమీపంలో 65వ నంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆత్మకూర్(ఎస్) మండలం ఇస్తాళాపురం గ్రామానికి చెందిన మహిళ దుర్మరణం.

4న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మానసనగర్ సమీపంలో కారు, ఆటో, లారీ ఢీకొన్న ఘటనలో ఆరుగురు మృత్యువాత.

5న సూర్యాపేట మండలం రాయినిగూడెం సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

7న చిలుకూరు మండలంలోని కవిత జూనియర్ కళాశాల సమీపంలో వాహనాన్ని లారీ ఢీ కొట్టిన ఘటనలో వ్యక్తి మరణం.

8న సూర్యాపేట మండలం రాజునాయక్‌తండా సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో అర్వపల్లి మండలం కొమ్మాల గ్రామానికి చెందిన యువకుడి దుర్మరణం.

9న సూర్యాపేట నుంచి స్వగ్రామం పిల్లలమర్రి గ్రామం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో యువకుడి మృతి.

9న ఆత్మకూర్ మండలం పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన బాలుడు ట్రాక్టర్ నడుపుతూ అదుపుతప్పి మృతి.

11న సూర్యాపేట మండలం రాయినిగూడెం సమీపంలో జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం.

11న సూర్యాపేట పట్టణంలోని జాతీయ రహదారి వంతెనపైన డీసీఎంను వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు.

కఠిన చర్యలు

–రాహుల్ హెగ్డే, ఎస్పీ, సూర్యాపేట

వాహనదారులు నిబంధనలు పాటించాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో వాహన తనిఖీలను విస్తృతం చేశాం. పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం, ఇష్టారీతిన రాకపోకలు సాగించడం మార్చుకోవాలి.

# అభివృద్ధి చేయరు.. ఆదాయం రాదు!

కరీంనగర్ : రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలు, చారిత్రక దేవాలయాలకు సందర్శకులు వచ్చే విధంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ప్రభుత్వం ఇటీవల పలు సందర్భాల్లో చెబుతోంది. గత నెలలో కరీంనగర్ జిల్లాలోని సైదాపూర్ మండలం సర్వాయిపేట గ్రామానికి సర్దార్ పాపన్న చారిత్రక ప్రదేశం అభివృద్ధికి రూ. 4.70 కోట్లు కేటాయించడం కొంత ఊరట కలిగిస్తోంది. కానీ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మిగతా పర్యాటక రంగంపై కొంతకాలంగా నిర్లిప్తంగా ఉన్నట్లు కనిపిస్తోంది. దక్షిణ కాశీగా పిలుచుకొనే వేములవాడ, ప్రముఖ అంజన్న క్షేత్రం కొండగట్టు, ధర్మపురి, కోటిలింగాలలాంటి పుణ్యక్షేత్రాల తోపాటు పలు పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు అవకాశ ముంది.వెచ్చించారు.. వదిలేశారు

పర్యాటకులను ఆహ్లాదపరిచే విధంగా కరీంనగర్ మానేరు జలాశయంలో ఆరేళ్ల క్రితం పడవ సౌకర్యం ఏర్పాటు చేశారు. పెద్దఎత్తున ఆదరణ రావడంతో స్పై జెట్ లాంటి పలు రకాల పడవలు తెప్పించారు. రెండేళ్ల క్రితం పెద్ద సంఖ్యలో పర్యాటకులు సందర్శించేలా రూ.కోటి వెచ్చించి జలవిహారం చేసేందుకు పడవ తెప్పించారు. నేటికీ ప్రారంభించలేదు. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ తరుణంలో ఎక్కువమంది మానేరు డ్యాంను సందర్శించుకునే అవకాశముంది. మరోవైపు రాజన్న సిరిసిల్లలోని కొదురుపాక మధ్యమానేరు డ్యాంలో పడవ సౌకర్యం వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. పెద్దపల్లి, కోటి లింగాలలోనూ ఇదే పరిస్థితి.

కుంటుపడిన పర్యవేక్షణరాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాలను అభివృద్ధి చేసి.. పర్యాటకంగా ఆకర్షించే విధంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం చూస్తోంది. అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో నిర్ణయాలు ఉండడం లేదనే విమర్శలు న్నాయి. కొత్త జిల్లాలు ఏర్పడిన అనంతరం.. ఆయా జిల్లాలకు పర్యాటక శాఖ అధికారులు ఎవరన్నది ఇప్పటికీ ప్రశ్నగానే మిగిలింది. జిల్లాల విభజన కాకముందు ఇక్కడి పర్యావరణ ఉ న్నతాధికారి కరీంనగర్ జిల్లాకే పరిమితంకాగా.. ప్రస్తుతం ఆయన బదిలీపై వెళ్లారు. ఇప్పటికీ ఆ స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఆ



శాఖ పనుల పర్యవేక్షణ కుంటుపడింది.

చివరి దశలో ...కరీంనగర్ జిల్లా కేంద్ర ఉజ్వల పార్కు రోడ్డులో హరిత హోటల్, రెస్టారెంట్ నిర్మాణ పనులు చివరి దశలో ఆగిపోయాయి. దాదాపు రూ.10 కోట్ల పైచిలుకు నిధులు వెచ్చించి గదుల నిర్మాణం ఇతరత్రా పూర్తి చేశారు. మరికొన్ని నిధులు వెచ్చిస్తే పర్యాటకులకు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుత ప్రభుత్వంలో ఆగిపోయిన పనులకు సంబంధించి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలుస్తోంది. వేములవాడ హరిత హోటల్ నిర్వహణ సరిగా లేదని విమర్శలు వస్తుండగా.. కొండగట్టులో అదనంగా గదులు పెంచాలనే డిమాండ్ ఎంతో కాలంగా ఉంది. మానేరు రివర్స్ ఫ్రంట్‌లో నూ పర్యాటకపరంగా పనులు చేపట్టినా.. అనంతరం నిలిచిపోయాయి.

ధూళికట్ట పర్యాటకంపై ఉత్కంఠ

పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలంలోని ధూళికట్ట బౌద్ధ స్తూపాన్ని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు. ఈ ప్రాంతానికి ఎంతో ప్రాధాన్యం ఉండగా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల జరిగిన సమీక్షలో బౌద్ధ క్షేత్రాలను పర్యాటక స్థలాలుగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. ఇప్పుడు ఈ క్షేత్రం చర్చానీయాంశమైంది.

# డీజే.. దరువేయ్.. జోగేయ్

హైదరాబాద్: హుషారైన సంగీతంతో ఉర్రూతలూగించే డీజేలతో యువత మత్తు ఊబిలో చిక్కుకుంటున్నారు. పబ్బుల్లో పోలీసులు, ఆబ్కారీ శాఖ అధికారులు ఎప్పుడు డ్రగ్స్ తనిఖీలు చేపట్టినా డీజేలు దొరికిపోతున్నారు. కేవలం వినియోగం మాత్రమే కాదు.. ఏకంగా గోవా, బెంగళూరు, ముంబయి నగరాల్లోని డ్రగ్ డీలర్లతోనూ డీజేలకు లింకులు ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది.

ముఠాలతో లింకు వృత్తిరీత్యా వేర్వేరు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలల్లోని పబ్బులు, ఈవెంట్లకు వెళ్లడం.. అక్కడే కాచుకుని కూర్చున్న డ్రగ్స్ ముఠాలతో సంబంధాలు.. ఈ కారణాలతోనే డీజేలు దారి తప్పుతు న్నారు. నగరంలో సుమారు 100కుపైగా పబ్బులున్నాయి.

వినియోగదారుల్ని ఆకర్షించేందుకు వారాంతాల్లో పబ్బుల నిర్వాహకులు ప్రత్యేక ఈవెంట్లు నిర్వహించి.. గోవా, బెంగళూరు, ముంబయి, దిల్లీ నగరాల్లో ఉండే డీజేలను పిలిపిస్తారు.

ఇక్కడి డీజేలు ఇతర నగరాలకు వెళ్తారు. కొందరు సొంతంగా ఈవెంట్లు నిర్వహిస్తుంటారు.డీజేలు మరింత చురుగ్గా ఉండేందుకు మత్తు



పదార్థాలకు అలవాటుపడుతున్నారు. డీజేలకు పబ్బుల యజమానులతో పాటు దేశవ్యాప్తంగా ఈవెంట్ ఆర్గనైజర్లు, వారి ద్వారా డ్రగ్స్ ముఠాలు, నైజీరీయన్లతో సంబంధాలు ఏర్పడుతున్నాయి.

తమ స్నేహితులు, పబ్బులో పరిచయమయ్యే వారికి డ్రగ్స్ తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. బాగా డబ్బు రావడంతో కొందరు తరచూ గోవా వెళ్లి నైజీరియన్ల లింకుతో హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకొస్తున్నారు.

తాజాగా ఆకస్మిక తనిఖీల్లో డీజే అభిషేక్ శ్రీవాస్తవ డ్రగ్స్ వినియోగించినట్లు తేలింది. జూన్ మూడో వారం నుంచి డ్రగ్స్ కేసుల్లో ఆరుగురు డీజేలు దొరికిపోయారు. ఆటకట్టిస్తున్న పోలీసులు నగరంలోని పబ్బులకు కొందరు వినియోగదారులకు డీజేల ద్వారా డ్రగ్స్ వస్తున్నట్లు గుర్తించిన టీజీ న్యాబ్ పోలీసులు కొందరిపై ప్రత్యేక నిఘా పెట్టారు. పోలీసులకు పట్టుబడ్డ తర్వాత కూడా డ్రగ్స్ తీసుకుంటున్నారో లేక సరఫరా చేస్తున్నారా అని ఆరా తీస్తున్నారు.

# జ్వరమా.. డెంగీ కావొచ్చు..!



సూర్యాపేట : రెండు రోజులు వరుసగా తీవ్రమైన జ్వరం.. కళ్ల నొప్పితో పాటు తలనొప్పి.. వంటిపై దద్దుర్లు.. కొంతమందికి వాంతులు కావడం.. లాంటి లక్షణాలు కనిపిస్తే డెంగీ కావొచ్చని వైద్యులు చెబుతున్నారు. వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్యుడిని సంప్రదించాలి. కానీ కొందరు సొంత వైద్యం చేసుకోవడం.. ఆర్ఎంపీల వద్ద చికిత్సలు చేయించుకోవడం.. పరిస్థితి విషమించిన తరువాత పెద్దాసుపత్రులకు వెళ్లడంతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

ప్రైవేటు ఆసుపత్రులు, రక్త పరీక్ష కేంద్రాల్లో డెంగీ నిర్ధారణకు కావాల్సిన 'ఎలీసా' పరీక్ష పరికరం అందుబాటులో లేదు. ర్యాపిడ్ కిట్ సాయంతో పరీక్షించి డెంగీగా నిర్ధారిస్తున్నారు. వీటికి కచ్చితత్వం ఉండదన్నది ప్రభుత్వ వైద్యాధికారుల వాదన.

సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిధిలోని టి-హబ్‌లోనే ఎలీసా పరీక్షలకు కావాల్సిన అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. బాధితులు జిల్లా కేంద్రానికి రావల్సిన అవసరం కూడా లేదు. రక్త నమూనాలను జిల్లాలోని ఏదైనా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇస్తే.. ఫలితాలను అక్కడికే అందజేస్తారు.


'ఏడీస్ ఈజిప్టై' అనే రకం దోమ కుట్టడం ద్వారా డెంగీ వస్తుంటుంది. ఈ దోమ మంచినీటిలో లార్వా (గుడ్లు) పెడుతూ వీటి సంఖ్యను వృద్ధి చేసుకుంటుంది. కాబట్టి ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను లేకుండా చూసుకోవాలి. కూలర్లు.. తాగి పడేసిన కొబ్బరి బోండాలు.. మూలన పగిలిన ఖాళీ సీసాలు, పూల కుండీలు వంటివి. మురుగు నీటిలో ఈ దోమ లార్వా అభివృద్ధి చెందదు. పరిసరారల పరిశుభ్రతతోనే ఈ ప్రమాదం నుంచి గట్టేక్కే అవకాశం ఉంది.

అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు

డాక్టర్ కోటాచలం, డీఎంహెచ్‌వో, సూర్యాపేట

రోగుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు. జిల్లాలోని పలు ప్రైవేటు ఆసుపత్రులపై పర్యవేక్షణ కొనసాగిస్తున్నాం. అక్కడక్కడా ఆయా ఆసుపత్రులకు నోటీసులు జారీ చేశాం. కలెక్టర్ ఆదేశాల ధరల పట్టిక ఏర్పాటు చేయాలని సూచించాం. ఏర్పాటు చేయని వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటాం.

# పెద్దల అండతో.. దేవరకొండలో..



దేవరకొండ : దేవరకొండ రెవెన్యూ డివిజన్ కేంద్రం, పురపాలిక.. రాజధానికి సమీపంలో ఉండడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. నియోజకవర్గ కేంద్రంలో నిబంధనలు అతిక్రమించి భవన నిర్మాణాలు చేపట్టినా పుర అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

**ఇదీ పరిస్థితి..** దేవరకొండ పురపాలికలో ఎనిమిది వేల నివాస గృహాలు, 20 వార్డులున్నాయి. ప్రధానంగా గాంధీనగర్, హనుమాన్‌నగర్, మార్కెట్ ప్రాంతంలో కొందరు బడా వ్యాపారులు రాజకీయ అండదండలతో తీసుకున్న అనుమతులకు, చేస్తున్న నిర్మాణాలకు పొంతన ఉండడం లేదు. జిం1 నిర్మించేందుకు అనుమతులు తీసుకొని నాలుగైదు అంతస్తుల వరకు నిర్మాణాలు చేపడుతున్నారు.

పుర పరిధిలోని 20వ వార్డులో కొందరు ఇళ్ల నిర్మాణానికి అనుమతి తీసుకొని కమర్షియల్ భవనం కట్టేస్తున్నారు. ఇదే వార్డులో ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాహకులు పాత గ్రామపంచాయతీ అనుమతిని రెన్యువల్ చేసుకోకుండా యథాతథంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఇళ్ల మధ్యనే ప్రైవేట్ ఆసుపత్రుల భవన నిర్మాణాలకు సెల్లార్ అనుమతితో బ్లాస్టింగ్‌లు చేస్తూ నిర్మాణం చేపడుతున్నా.. పట్టణ ప్రణాళిక అధికారులు కిమ్మనడం లేదు.మరికొందరు పట్టా భూముల్లో గ్రామకంఠాలు, వక్ఫ్‌భూముల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. పట్టణంలో 20వ వార్డులో ఉన్న పట్టా భూమి సర్వే నెంబరును 19వ వార్డులోని గ్రామకంఠం భూమికి వేసి బహుళ అంతస్తుల నిర్మాణాలు కడుతున్నారు. పుర కార్యాలయ పరిధిలో 200 చ.మీటర్ల కంటే ఎక్కువ స్థలంలో నిర్మాణం చేయాల్సి వస్తే కార్యాలయానికి మార్ట్‌గేజ్ చేయాల్సి ఉంటుంది. కానీ అందుకు భిన్నంగా రెండు భాగాలు చేసి అనుమతులు తీసుకున్నారు. భవన నిర్మాణానికి ప్రణాళిక తీసుకున్న తర్వాత నిబంధనల ప్రకారం ముందు, వెనుక, పక్కన సెట్ బ్యాక్ వదలాల్సి ఉంటుంది. ఇలాంటి నిబంధనలు ఇక్కడ కనిపించడం లేదు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశా వంశీ, దేవరకొండ

పట్టణంలో అక్రమ నిర్మాణాలు, కబ్జాలు పెరిగిపోతున్నాయి. ఈ విషయంపై సీడీఎంఏ కార్యాలయానికి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా. అయినా నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

కొత్త నిర్మాణాలు జరగడం లేదు

భాస్కర్‌రెడ్డి, పురపాలిక కమిషనర్

పుర కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తులకు అనుమతులు ఇవ్వలేదు. గతంలో అనుమతి తీసుకున్న వారే ఈ నిర్మాణాలు చేపడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి.

# పెరుగుతున్న జ్వర బాధితులు



పెద్దపల్లి: పల్లె, పట్టణం తేడా లేకుండా జ్వరాలు విజృంభిస్తుండటంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు బాధితులతో కిక్కిరిసిపోతున్నాయి. గ్రామాల్లో వైద్య సేవలు కేవలం ఉదయం సమయానికే పరిమితం కావడంతో బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఒళ్లు నొప్పులు తీవ్రంగా పెరుగుతున్నాయని జ్వరబాధితులు వాపోతున్నారు. జిల్లాలో ఆగస్టు నెలలో 8918కి పైగా ప్రజలు జ్వరాల బారిన పడినట్లు వైద్యఆరోగ్యశాఖ రికార్డులలో నమోదు చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో 67 డెంగీ కేసులు నమోదయ్యాయి.

పల్లెల్లో సేవలు అంతంతే...

గ్రామాల్లోని పేద ప్రజలకు వైద్య సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఒక ప్రధాన ఆసుపత్రితో పాటు ఒక జనరల్ ఆసుపత్రి, 7 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటిలో 146 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. 66 పల్లెదవాఖానాల్లో కేవలం 60 మంది మాత్రమే వైద్యులున్నారు. కమాన్‌పూర్, మేడారం, కాల్వశ్రీరాంపూర్‌లోని 24 గంటల ఆరోగ్య కేంద్రాల్లో సైతం ఒక్కో వైద్యుడు మాత్రమే ఉన్నారు. జిల్లాలో 280 గ్రామపంచాయతీలుంటే పల్లెదవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు గ్రామాలకే పరిమితమయ్యాయి. ఇవి కూడా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే పనిచేస్తాయి. అత్యవసర పరిస్థితుల్లో తాము సమీపంలోని పట్టణాలకు వెళ్లక తప్పని పరిస్థితులు నెలకొన్నాయని గ్రామీణ ప్రాంత ప్రజలు అంటున్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే వేల రూపాయలు ఖర్చవుతున్నాయని బాధితులు వాపోతున్నారు. సాధారణ జ్వరానికి చికిత్స తీసుకుంటే రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వ్యయం అవుతుందని జ్వరపీడితులు చెబుతున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలకే అధికంగా వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


చర్యలు తీసుకుంటున్నాం

జిల్లాలో క్షేత్రస్థాయిలో జ్వరాలపై సర్వే నిర్వహించి అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి సంబంధిత గ్రామపంచాయతీ సహకారంతో డ్రైడే కార్యక్రమా లు నిర్వహిస్తున్నాం. దోమల తీవ్రత తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాల్లో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.కె.ప్రమోద్‌కుమార్, జిల్లా వైద్యాధికారి

# పాన్ ఇండియా మత్తుముఠాలు

హైదరాబాద్: మత్తు ముఠాలకు దేశవ్యాప్తంగా డ్రగ్స్ స్మగ్లర్లతో సంబంధాలు బయటపడుతున్నాయి. కూకట్‌పల్లిలో రసాయన ప్రయోగశాల ఏర్పాటు చేసి ఎండీఎంఏ తయారు చేస్తున్న సినీ నిర్మాత నరసింహరాజు, మహేందర్‌రెడ్డిని కేరళ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయన 20 ఏళ్ల నుంచి ప్రయోగశాలలో బ్లాడర్, కిడ్నీ జబ్బులకు ఉపయోగించే మందులు తయారు చేస్తున్నట్టు నిర్ధారించారు.

గుట్టు వీడిందిలా..కూకట్‌పల్లిలోని ల్యాబ్‌లో అత్యాధునిక యంత్రపరికరాలతో ఎంఫిటమైన్‌ను ఎండీఎంగా మార్చుతున్నారు. రసాయన పదార్థాల వ్యాపారాల అనుమతిని ఆసరా చేసుకొని మత్తుపదార్థాలను విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్టు గుర్తించారు. కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడుల్లోని డ్రగ్స్ డీలర్లతో సంబంధాలున్నాయి. హెచ్‌న్యూ, బోయినపల్లి పోలీసులు రూ. 8.5కోట్ల విలువైన ఎంఫిటమైన్ విక్రయించేందుకు సిద్ధమైన తాపీమేస్త్రీ నాగరాజును అరెస్ట్ చేశారు. ఇతడికి ఎంఫిటమైన్‌ను దాచిపెట్టమని ఇచ్చిన అంజిరెడ్డిని అప్పటికే అరెస్ట్ చేశారు. మత్తు పదార్థాల ముడిసరకు తయారు చేస్తున్న పరిశ్రమను



సీజ్ చేశారు. ఈ ముఠాకు బెంగళూరు, ముంబయి, గోవాలోని స్మగ్లర్లతో సంబంధాలున్నట్టు అనుమానిస్తున్నారు.

గతేడాది నెల్లూరు జిల్లాకు చెందిన బడా వ్యాపారిని నగర పోలీసులు డ్రగ్స్ కేసులో అరెస్ట్ చేశారు. గోవా నుంచి ఎల్ఎస్‌డీబ్లాట్స్, కొకైన్, హెరాయిన్ తీసుకొచ్చి ప్రముఖులకు అందజేస్తున్నట్టు తెలుసుకున్నారు. సంగారెడ్డికి చెందిన వ్యాపారి ఏపీ, మహారాష్ట్ర, తెలంగాణలకు 30 ఏళ్లుగా డైజోఫాం సరఫరా చేస్తున్నారు. ఇతడి నుంచి 1-2 కిలోల డైజోఫాం కొనుగోలు చేసిన వారు రూ.కోట్లు సంపాదించినట్టు నిర్ధారణకు వచ్చారు. ఆ జాబితాలో నలుగురు ఎక్సైజ్ పోలీసు అధికారులు కూడా ఉండటం గమనార్హం.

# నాలాలపై నజర్

హైదరాబాద్ : రాజధానిలో ముంపునకు కారణమవుతున్న నాలాలను పూర్తిగా సంస్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాలాలపై ఆక్రమణలను తొలగించి పూర్వ రూపు తేవడానికి ప్రణాళికను రూపొందించింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ బల్దియా అధికారులతో సమావేశంకానున్నారు. నాలాలపై ఆక్రమణలను తొలగించడానికి హైడ్రా రంగంలోకి దిగనుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. రాజధానితోపాటు దాని చుట్టుపక్కల జిల్లాల పరిధిలో ఆక్రమణలు తొలగించడానికి గత ప్రభుత్వం రూ.985 కోట్లతో వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఎన్‌డీపీ) మొదలుపెట్టింది. నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడంతో పనులు అసంపూర్తిగానే ఉండిపోయాయి. మొదటి దశ పూర్తికాకుండానే రెండో దశ కింద రూ.2,500 కోట్లతో ఎస్ఎన్‌డీపీ పనులు చేపడతామని అప్పట్లో జీహెచ్ఎంసీ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. మొదటి దశకే నిధులివ్వని సర్కార్ రెండో దశను పక్కన పెట్టింది.

ఇదీ సర్కార్ ప్రణాళిక!తక్షణం నాలాల వ్యవస్థను సంస్కరించాలని సీఎం రేవంత్ నిర్ణయించారు. దీనిపై దానకిషోర్‌తో ఇటీవల చర్చించారు. నిధులు విడుదల చేస్తే తక్షణం పనులను మొదలుపెట్టి వచ్చే వర్షాకాలం నాటికి పూర్తి చేయొచ్చని దానకిషోర్ సీఎంకు వివరించారు. దీనికి అంగీకరించిన ఆయన నాలాలపై ఆక్రమణల తొలగింపు, ఇతర పనులకు రూ.650 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించారు. నగరంలో దాదాపు నాలాలన్నీ 50 అడుగుల వెడల్పు నుంచి ఆక్రమణ



లతో చాలాచోట్ల పది అడుగుల వెడల్పుకు నాలాలు చేరుకున్నాయి. అవసరమైన చోట వీటిని తొలగించే పనిని హైడ్రాకు అప్పగించాలని నిర్ణయించారు. నేల కొరిగిన విద్యుత్తు స్తంభాలు

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో జీహెచ్ఎంసీ పరిధిలోని మెట్రోజోన్‌లో 98, రంగారెడ్డి జోన్‌లో 157, మేడ్చల్ జోన్‌లో 157 విద్యుత్తు స్తంభాలు నేల కొరిగాయని దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణి సంస్థ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. రాజేంద్రనగర్ సర్కిల్‌లో 102 స్తంభాలు, 10 డీటీఆర్ స్ట్రక్చర్‌లు దెబ్బతిన్నాయని పేర్కొంది.

## పర్యవేక్షణ లోపం.. గొడవలకు ఆస్కారం

తూప్రాన్: చిన్నారుల భవితకు బంగారు బాటలు వేసే విద్యాలయంలో దాడి ఘటనలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. పసిమనసుల్లో ద్వేషాలకు బీజం పడుతోంది. పైతరగతుల విద్యార్థులు, కింది తరగతుల వారిపై దాడులకు పాల్పడడం విస్మయానికి గురిచేస్తుంది. ఇదే పరిస్థితి తూప్రాన్ అల్లాపూర్ టోల్‌గేట్ బాలుర గురుకుల పాఠశాలలో నెలకొంది. రెండు నెలల్లో జూనియర్లపై సీనియర్ విద్యార్థులు రెండుసార్లు దాడి చేయడం పర్యవేక్షణ లోపానికి నిదర్శనం. జులై 17వ తేదీన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులను గదిలో బంధించి కొట్టిన సంగతి విదితమే. ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులను మందలించి హెచ్చరించారు. ఇటువంటివి పునరావృతం కాకుండా డీఎస్పీ వెంకటరెడ్డి, ఆర్డీవో జయచంద్రారెడ్డి సమావేశం ఏర్పాటు చేసి సూచనలు చేశారు. మరో ఘటన చోటు చేసుకోవడంతో చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.చర్యలు అంతంతమాత్రమే గురుకుల పాఠశాలలో అయిదో తరగతి నుంచి ఇంటర్ వరకు 560 పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరి పర్యవేక్షణకు అధికారులు చర్యలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. ప్రిన్సిపల్ ఆదేశాలను సిబ్బంది పాటించకపోవడం, హెచ్చరికలు విద్యార్థులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితికి కారణమవుతున్నాయి. రాత్రిపూట విద్యార్థులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నా, కట్టడి చేసేవారు లేకుండాపోయారు. సీనియర్ విద్యార్థుల ఆధిపత్య ధోరణి వల్లే ఘటనలకు దారితీస్తోందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికైనా దాడులకు పాల్పడుతున్న వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటేనే కట్టడి చేయవచ్చు. ఈ విషయమై వివరణ కోరేందుకు ప్రయత్నిస్తే గురుకులాల కార్యదర్శి స్పందించడం లేదు.తొమ్మిదో తరగతి విద్యార్థులపై దాడితూప్రాన్ గురుకుల పాఠశాలలో సీనియర్ విద్యార్థులు, జూనియర్లపై దాడికి పాల్పడ్డారు. భోజనం చేశాక, ఎవరి గదుల్లో వారు ఉన్న సమయంలో పాత గొడవలను మనసులో పెట్టుకుని పదో తరగతిచదు వుతున్న వారు, తొమ్మిదో తరగతి చదువుతున్న నిశాంత్, అభినవ్, బలరామ్‌లను వేరే గదికి తీసుకెళ్లి, కేకలు వేయకుండా నోట్లో గుట్టలు కుక్కి ఇష్టానుసారం కొట్టారు. ఈ విషయాన్ని బయటకు చెప్పొద్దని బెదిరించారు. గాయపడిన విద్యార్థులు తల్లిదండ్రులకు రహస్యంగా సమాచారం అందించారు.

## కరాటే శిక్షణ.. బాలికలకు ఆత్మరక్షణ

కరీంనగర్ : ప్రస్తుతం జరుగుతున్న సంఘటనలతో బాలికలకు ఆత్మరక్షణ ఎంతో అవసరం. వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందేలా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పాఠశాలల్లో ప్రత్యేకంగా కరాటే తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యార్థినులు తమకు తాము ఆత్మరక్షణ పొందేలా శిక్షణ ఇచ్చి తయారు చేస్తున్నారు. రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ పథకం కింద పాఠశాలలను ఎంపిక చేసి మూడు నెలల పాటు శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇందుకోసం ఈ విద్యా సంవత్సరానికి గాను నిధులు విడుదల చేశారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థినులకు కరాటే నేర్పించడం ద్వారా ఆత్మరక్షణతో పాటు క్రమశిక్షణ, ఏకాగ్రత పెంచేందుకు దోహదపడుతుంది. ప్రభుత్వం కరాటే శిక్షణ ఇప్పిస్తుండడంతో పాఠశాలల్లో విద్యార్థినులు కూడా ఆసక్తి చూపుతున్నారు. ఆపద సమయాల్లో ఉపయోగపడే విధంగా కిక్స్, పంచులు తదితర అంశాలను నేర్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఉమ్మడి జిల్లాలో 645 పాఠశాలలు ఎంపిక

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 645 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో 626 ఉన్నత, కస్తూర్బా గాంధీ, గురుకుల



పాఠశాలలను ఎంపిక చేయగా, రూ.93.90 లక్షల నిధులు కేటాయించారు. అలాగే 19 ప్రాథమికోన్నత పాఠశాలలను ఎంపిక చేసి రూ.2.85 లక్షలు విడుదల చేశారు. సెప్టెంబర్–ఫిబ్రవరి మధ్యలో మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వాలని, వారానికి మూడు సెషన్లు చొప్పున నెలకు పన్నెండు సెషన్ల తరగతులు నిర్వహించాలని సూచించారు. పాఠశాలకు నెలకు రూ.5వేల చొప్పున మూడు నెలలకు గాను రూ.15వేల నిధులు కేటాయించారు. బాలికలు ఎక్కువగా ఉన్న పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. కరాటే శిక్షకుడిని నియమించుకోవాల్సి ఉండగా, మహిళా శిక్షకురాలికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

## మీ వీధిలోకే ఆధార్ సేవలు

హైదరాబాద్: 'ఆన్‌లైన్‌లో స్లాట్ దొరకదు.. ఉదయం ఎప్పుడో వెళ్తే గానీ టోకెన్ ఇవ్వరు. వరుసలో గంటల తరబడి నిల్చున్నా పని ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేం. ఇవీ నగరవాసుల ఆధార్ అప్‌డేట్ కష్టాలు. కేంద్రాలకు పరిమితికి మించి దరఖాస్తుదారులు చేరుకోవడంతో సేవలు మాత్రం పూర్తిస్థాయిలో లభించడం లేదు. ఇలాంటి సమయంలో వీధుల్లోనే ఆధార్ సేవలంటూ అబిడ్స్ జీపీవో అధికారులు ప్రకటించడం ఊరట కలిగించే విషయం. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో అమలు చేస్తుండగా.. మరింత విస్తృతం చేయనున్నారు.

ఎలా సంప్రదించాలి.. : ఒకే కాలనీ లేదా వివిధ అపార్ట్‌మెంట్లకు చెందిన సుమారు 50 లేదా 200 మందికి ఒకేసారి ఆధార్ సేవలను అందించేందుకు హైదరాబాద్ జనరల్ పోస్టాఫీసు అధికారులు సిద్ధమయ్యారు.కొత్తగా ఆధార్ నమోదు, ఫొటోలు, పేర్ల సవరణ, వేలిముద్రలు, చిరునామాలు, ఫోన్ నెంబర్ల మార్పులు చేసేందుకు



శిబిరాలు ఏర్పాటు చేస్తారు.

అబిడ్స్‌లోని జీపీవోకి వచ్చి దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోగా కావాల్సిన తేదీల్లో శిబిరాలు ఏర్పాటు చేయిస్తున్నారు. శని, ఆదివారాలతో పాటు సాధారణ రోజుల్లో సేవలందిస్తారు.

ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేసుకోవాలని భావించేవారు. 94410 73422, 94404 54582, 040 -23463595 నంబర్లను సంప్రదించొచ్చు.

అన్ని రకాల సేవలందిస్తాం

– ప్రసాద్, చీఫ్ పోస్ట్‌మాస్టర్, జీపీవో అబిడ్స్

కమ్యూనిటీ సేవల ద్వారా విస్తృత స్థాయిలో సేవలు ప్రారంభించాం. ఇప్పటికే ధూల్‌పేట్, కొండాపూర్, ముషీరాబాద్ తదితర ప్రాంతాల్లో సేవలందించాం. ఇందుకు నామమాత్రపు రుసుం చెల్లించాలి.

## ఆదుకున్న అల్పపీడనం..!

భువనగిరి : భారీ వర్షాలు యాదాద్రి భువనగిరి జిల్లాను ఆదుకున్నాయి. 15 రోజులుగా సరైన వర్షాలు లేక ఎండి పోయే స్థితితో ఉన్న మెట్ట పంటలకు ప్రాణం పోశాయి. చెరువు, కుంటల్లోకి నీళ్లు వస్తున్నాయి. జిల్లాలో వరి తరువాత అత్యధికంగా సాగుచేసింది పత్తి . వర్షాలు లేక పత్తి, కంది, ఇతర మెట్ట పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో ఈ వర్షాలు ప్రాణం పోశాయి. జిల్లాలో పత్తిని 1,02,149 ఎకరాల్లో, కంది 3,701 ఎకరాలు, ఇతర మెట్ట పంటలు 829 ఎకరాల్లో సాగు చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో వరి పైరును 2,75,244 ఎకరాల్లో సాగు చేశారు.



ఈ వర్షాలతో పలు మండలాల్లో వరి సాగు పెరిగే అవకాశం ఉంది.

లోటు నుంచి అధిక వర్షం

ఆగస్టు 31 నాటికి జిల్లాలోని నాలుగు మండలాల్లో లోటు వర్షపాతం ఉండగా.. ఇప్పుడు కాస్తా సాధారణ వర్ష పాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 17 మండలాల్లో 392.2 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 381.9 ఎంఎంల వర్షం మాత్రమే పడింది. 3.0 మిల్లీ మీటర్ల తక్కువ వర్షపాతం నమోదైంది. ఒక్క బొమ్మలరామారం మండలంలోనే సాధారణ కన్నా అధిక వర్షపాత కురవగా.. నాలుగు మండలాల్లో లోటు వర్షం, మిగిలిన 12 మండలాల్లో సాధారణ వర్షం మాత్రమే పడింది. శుక్ర, శని, ఆదివారం కురిసిన వర్షాలతో రికార్డులు తారుమారయ్యాయి. జిల్లా మొత్తంగా పరిశీలిస్తే 25 మి.మీ వర్షం అధికంగా ఉండటం విశేషం.

## అడుగడుగునా గుంతలు.. పట్టించుకోక చింతలు



హైదరాబాద్: వర్షాలతో నగరంలోని రోడ్లు గతుకులమయంగా మారాయి. సీసీ రోడ్లు, బీటీ రోడ్లనే తేడా లేకుండా రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. మ్యాన్‌హోళ్ల మరమ్మతులు దోపిడీకి అడ్డాగా మారడంతో వరదంతా రోడ్లపై నిలిచి బురదమయం అవుతున్నాయి.

**ప్రధాన రహదారులపై..**

నగరంలో 10వేల కి.మీ.ల రోడ్లుంటే అందులో 885 కి.మీ ప్రధాన రహదారులు ప్రైవేటు సంస్థల నిర్వహణలో ఉన్నాయి. గుంతల్లేకుండా, అన్ని రకాల ప్రమాణాలతో రోడ్లను బాగుచేయాల్సిన బాధ్యత వాటిదే. జోనల్, సర్కిళ్ల స్థాయి ఇంజినీర్లు గుత్తేదారు సంస్థలపై పర్యవేక్షణను గాలికొదిలేశారు. రహదారులపై బల్దియాకు రోజూ 1000కిపైగా ఫిర్యాదులందుతున్నాయి.

**అధ్వానంగా అంతర్గత రోడ్లు..**

అసెంబ్లీ ఎన్నికల ముందు గత ప్రభుత్వం కాలనీ రోడ్లకు పచ్చజెండా ఊపింది. కొత్త సర్కారు పాలన మొదలయ్యాక వాటిని రద్దు చేసింది. పాతబస్తీలో 90శాతం కాలనీ రోడ్లు గుంతలమయంగా మారాయి. ఖైరతాబాద్ జోన్ పరిధిలోనూ అంతే. కార్వాన్, మెహిదీపట్నం, నాంపల్లి, గుడిమల్కాపూర్ అంతర్గత రోడ్లపై గుంతలున్నాయి. వివేకానందనగర్ కాలనీ ప్రధాన రహదారి, ఓయూ కాలనీ డ్రీమ్ వ్యాలీ రోడ్డు, సూర్యనగర్‌కాలనీ, బృందావన్‌కాలనీ రోడ్లు అధ్వానంగా మారాయి.

బాలనగర్ మెట్రోస్టేషన్ వద్దనున్న డీ మార్ట్ సర్వీసు రోడ్డు మురుగు కుంటలా మారింది. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ రోడ్డు, జేఎన్‌టీయూ మెట్రో స్టేషన్ సర్వీసు రోడ్డు, బాలాజీనగర్ కూకట్‌పల్లి మెట్రో స్టేషన్ పక్కన బాలాజీనగర్ వెళ్లే రోడుపై గుంతలను పూడ్చట్లేదు.

రోడ్లను ఏజెన్సీలు చక్కదిద్దాల్సిందే: దానకిశోర్

గుంతల రోడ్లు, తాగునీటి సరఫరా అంశాలపై రాష్ట్ర పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మాసబ్‌ట్యాంక్‌లోని డీటీసీపీ భవనంలో ఆయా శాఖల ఉన్నతాధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌లోని ప్రధాన రహదారుల నిర్వహణను సీఆర్ఎంపీ కింద ప్రైవేటు ఏజెన్సీలకు ఇచ్చామని, ఈ ఏడాదితో వారి గడువు పూర్తవుతున్నందున తగు చర్యలు తీసుకోవాలన్నారు. కాంట్రాక్టు కాలపరిమితి ముగిశాక.. మెరుగైన స్థితిలో జీహెచ్ఎంసీకి అప్పగించాలని గుర్తుచేశారు. తాగునీటి సరఫరాలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎం.దానకిషోర్ జలమండలి ఎండీ ఆశోక్‌రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ ఇతర ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్‌గా అడుగులు..!



మిర్యాలగూడ : ఒకప్పుడు చేతికి గడియారం పెట్టుకోవడం.. అందులోనూ ఆకర్షణీయమైన వాచ్‌లను కేవలం సమయం, తేదీ చూసుకోవడంతో పాటు అందంగా కనిపించడానికి మాత్రమే ఉపయోగించేవారు. కానీ కాలంతో పాటు మారిన సాంకేతిక పరిజ్ఞానం.. సమయం, తేదీ చూసుకునేందుకు స్మార్ట్ ఫోన్‌లు రావడంతో.. కొన్నాళ్ల క్రితం వరకు చేతి గడియారాల వాడకం బాగా తగ్గింది. ఇక కాలంతో పాటు పరుగులు పెడుతున్న సాంకేతిక పరిజ్ఞానం టెక్ ప్రియులకు స్మార్ట్ వాచ్‌ను అందుబాటులోకి తెచ్చింది.

ప్రస్తుతం పెద్ద ఎలక్ట్రానిక్స్ మాల్స్ నుంచి చిన్న మొబైల్ దుకాణాల్లోనూ స్మార్ట్ వాచ్‌లు లభ్యమవుతున్నాయి. పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ ఉపయోగపడే స్మార్ట్ వాచ్‌లు సేవలను బట్టి రూ.400 నుంచి రూ.80వేల వరకు ధరలు అందుబాటులో ఉండగా.. రూ.3లక్షల వరకు ధర సైతం ఉన్నాయని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు.

అనేక ఫీచర్లు..ఉమ్మడి జిల్లాలోని పలు పట్టణాల్లో సుమారు పదేళ్ల క్రితమే స్మార్ట్ ఫోన్ మార్కెట్‌లోకి వచ్చినప్పటికీ.. తొలి నాళ్లలో కేవలం అడుగులు లెక్క పెట్టడం, సమయం చూసుకోవడానికి మాత్రమే పనికొచ్చేది. కాలక్రమంలో మారుతున్న పరిజ్ఞానంతో స్మార్ట్ వాచ్‌ల్లో అనేక ఫీచర్లు అందుబాటులోకి వచ్చాయి. స్మార్ట్ ఫోన్‌ను వాచ్‌కు అనుసంధానం చేయడం ద్వారా.. ఫోన్ ఎవరు చేస్తున్నారో తెలుసుకోవడం నుంచి సంక్షిప్త సందేశాల వరకు అన్నీ చూసుకోవచ్చు. పలు వాచ్‌ల్లో మనం ఎన్ని అడుగులు వేస్తున్నామో లెక్కకట్టడంతో పాటు ఎన్ని కేలరీల శక్తి వినిగించుకున్నాం.. గుండె, నాడీ వ్యవస్థల పనితీరు, ఆక్సిజన్ లెవెల్, ఎన్ని గంటలు నిద్రపోవాలి వంటి సదుపాయాలు సైతం అందుబాటులో ఉన్నాయి.

అత్యవసర సమయాల్లో తమ వారికి సమాచారం అందించేలా అత్యాధునిక స్మార్ట్ వాచ్‌లు సైతం ప్రస్తుతం విపణిలో అందుబాటులో ఉన్నాయి. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, మనిషి స్పృహ తప్పి పడిపోయిన సందర్భాల్లో తక్షణమే తమ వారికి అత్యవసర సమాచారం చేరవేస్తాయి. ఇక మరి కొన్ని స్మార్ట్ వాచ్‌లు సెల్ సిగ్నళ్లు లేని అటవీ ప్రాంతాల్లో సైతం శాటిలైట్ల ద్వారా సిగ్నల్ అందుకుని పని చేస్తాయి.

శిక్షణలో ఎంతో ఉపయోగకరం

ఉమ, ఎరోబిక్ శిక్షకురాలు, సూర్యాపేట

గత ఐదేళ్లుగా సూర్యాపేటలో ఎరోబిక్‌లో మహిళలకు శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నాను. ఎరోబిక్ శిక్షణలో స్మార్ట్ వాచ్ ఎంతో ఉపయోగపడుతుంది. ఎవరికి ఎంత సేపు శిక్షణ ఇవ్వాలో ముందే సెట్ చేసుకోవచ్చు. దీంతో పాటు శిక్షణలో ఉన్న సమయంలో ఫోన్‌ను ఉపయోగించలేము కాబట్టి దానికి ప్రత్యామ్నాయంగా స్మార్ట్‌ఫోన్ ఉపయోగపడుతుంది.

## వానొచ్చె.. కొంప ముంచె..!

నల్గొండ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తాజాగా కురిసిన వర్షాలకు అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం రూ.100 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు తెలిసింది. అత్యధికంగా 70 శాతానికి పైగా నష్టం కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోనే జరిగిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వరి, పత్తి పంటల నష్టంతో పాటూ రహదారులు కుంగడం, బ్రిడ్జిలు కూలడం, విద్యుత్తు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కూలి విద్యుత్తు అంతరాయం ఏర్పడటం లాంటివాటితోనే భారీ నష్టం వాటిల్లింది.ఇప్పుడిప్పుడే వర్షం తెరిపివ్వడంతో అధికారులు పంట నష్టంపై క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించడానికి సిద్ధమవుతున్నారు. దీంతో పంట నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది. ఒక్క సూర్యాపేట జిల్లాలోనే అధికారులు వరి, పత్తితో పాటూ పెసర ఇతర పంటలు కలిపి 27,705 ఎకరాల్లో నష్టపోయినట్లు నివేదిక రూపొందించారు. నల్గొండ, యాదాద్రి జిల్లాల్లో మూసీ పరివాహక ప్రాంతంలో సుమారు 5 వేల ఎకరాల చొప్పున వరి పంటకు నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు.మొత్తంమ్మీద పంటల మునక వల్లే సుమారు రూ.50 కోట్లకు పైగా రైతులు నష్టపోయినట్లు సమాచారం. మరోవైపు కోదాడ పట్టణం, తుంగతుర్తి నియోజకవర్గంలోని మద్దిరాల, తుంగతుర్తి, నూతన్‌కల్, మోత్కూరు, అడ్డగూడూరు మండలాల పరిధిలో భారీగా రహదారులు నష్టపోయినట్లు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం జరిపిన సమీక్ష సందర్భంగా సూర్యాపేట జిల్లాలో 7 ఇళ్లు పూర్తిగా, 27 ఇళు పాక్షికంగా కూలిపోయినట్లు అధికారులు వెల్లడించారు.

సూర్యాపేట జిల్లాలోనే ఏడు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి సుమారు 2 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కోదాడ, చిలుకూరు మండలంలోని పలు చెరువు కట్టలు తెగడం వల్ల వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. చెరువు కట్టల మరమ్మతులను సైతం ఒకట్రెండు రోజుల్లో ప్రారంభించనున్నారు.

ప్రస్తుతం పంటలింకా ముంపులోనే ఉన్నందున నాలుగైదు రోజుల్లో ముంపు మొత్తం తగ్గితే క్షేత్రస్థాయి పరిశీలన చేసి పంట నష్టాన్ని పక్కాగా లెక్కగడుతామని సంబంధిత అధికారి ఒకరు వెల్లడించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు ఎప్పటికప్పుడు



మూడు జిల్లాల ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో రహదారులకు మరమ్మతులను ప్రారంభిస్తామని మంత్రి కోమటిరెడ్డికు వెల్లడించారు.

రహదారులు, విద్యుత్తు శాఖకు తీవ్ర నష్టం


సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో రహదారులు తీవ్రంగా నష్టపోయాయి. చాలా చోట్ల నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిలు కొట్టుకుపోయాయి. వాగులు, వంకలు పొంగిపొర్లడంతో 565 జాతీయ రహదారితో పాటూ అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయి.ప్రాథమిక సమాచారం ప్రకారమే ఒక్క సూర్యాపేట జిల్లాలోనే రహదారుల మరమ్మతులకు రూ.25 కోట్ల మేర నిధులు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత మరిన్ని నిధులు అవసరం అయ్యే అవకాశం ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

హుజూర్‌నగర్ పట్టణంతో పాటూ మేళ్లచెర్వు, మోతే, కోదాడ, చిలుకూరులోని చాలా ప్రాంతాలు రెండు రోజుల పాటూ విద్యుత్తు అంతరాయాలతో అంధకారంలోనే ఉన్నాయి. ఇప్పటి వరకు సుమారు 750 వరకు స్తంభాలు విరిగిపోగా..150 ట్రాన్స్‌ఫార్మర్‌లు దెబ్బతిన్నాయి. ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో విద్యుత్తును పునరుద్ధరించాల్సి ఉంది. వరద పూర్తిగా తగ్గి సాధారణ పరిస్థితులు నెలకొంటే నష్ట తీవ్రతపై పక్కాగా అంచనాలు వస్తాయని ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు.

## ట్రామా కేంద్రం ఎప్పుడొచ్చెను!

కరీంనగర్: ఉమ్మడి జిల్లాలో ఎక్కడ రోడ్డు ప్రమాదం జరిగినా.. దగ్గరలో అత్యవసర వైద్యం అందుబాటులో లేక విలువైన ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. నాలుగు జిల్లాల్లో ప్రధాన ఆస్పత్రులతోపాటు గోదావరిఖనిలో సార్వజనిక ఆస్పత్రి ఉన్నా అత్యవసరమైతే కరీంనగర్ జనరల్ ఆస్పత్రికి.. వరంగల్ ఎంజీఎం.. హైదరాబాద్‌కు తరలించక తప్పని పరిస్థితి.. కొన్నేళ్లుగా ట్రామా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామనే హామీలు ఆచరణకు నోచుకోవడం లేదు. మళ్లీ ఇటీవల కొత్త ప్రభుత్వం వీటి ఏర్పాటు దిశగా ప్రయత్నిస్తుండటంతో ఉమ్మడి జిల్లావాసుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. గతంలో జిల్లా కేంద్రాల్లో ఉన్న ఆస్పత్రుల్లోనే వీటిని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలొచ్చినా ఆచరణ సాధ్యమవలేదు. ప్రమాదం జరిగిన గంటలోపు బాధితుడికి సత్వర చికిత్సను అందించడం కీలకమని వైద్యులు చెబుతుంటారు. అందుకనే ట్రామా కేంద్రాలు ఉంటే విషమ పరిస్థితిలో అప్పటికప్పుడు అత్యాధునిక సేవలు అందే వీలుంటుంది.

రాష్ట్రంలో ప్రతి 35 కి.మీ.ల పరిధిలో ఒక ట్రామా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం భావిస్తోందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇటీవల వెల్లడించారు. రోగుల సంరక్షణను దృష్టిలో పెట్టుకుని ఇప్పుడున్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు




అనుసంధానంగా వీటిని ఏర్పాటు చేసే యోచనలో ఉన్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 75 కేంద్రాల ద్వారా మెరుగైన సేవల్ని అందించే అవకాశం ఉంటుందన్నారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో రెండు లేదా మూడు చోట్ల వీటి ఏర్పాటుకు ఆస్కారమున్నది. మొదట కరీంనగర్ కేంద్రంగా ఒకటి నెలకొల్పినా నాలుగు జిల్లాల వారికి సాంత్వన చేకూరనుంది. గత ప్రభుత్వం తెలంగాణ ఎమర్జెన్సీ రెస్పాన్స్ ఇనిషియేటివ్ (టెరి) పేరిట 55 చోట్ల ట్రామా కేంద్రాలను ఏర్పాటు చేయాలనే ప్రక్రియ ముందుకు సాగలేదు.

24 గంటల సేవలు రోడ్డు ప్రమాదాలు, మంటల్లో గాయాలు, దాడులు, గుండెపోటు, మెదడు పోటు, మాతాశిశు అత్యవసర పరిస్థితులు, రక్తస్రావం సంఘటనల్లో అత్యవసరంగా అన్ని విధాలా వైద్య చికిత్సను ఏకకాలంలో అందించే సదుపాయం ట్రామా కేంద్రాల్లో ఉంటుంది. జనరల్ ఫిజిషియన్లు, ఎముకలు, గుండె, నరాల సంబంధిత వైద్యులు, శస్త్రచికిత్స నిపుణులు, మత్తు మందు ఇచ్చే వైద్యులు, ప్లాస్టిక్ సర్జరీ, రేడియాలజీ నిపుణులు ట్రామా కేంద్రాల్లో ఉంటారు. స్కానింగ్‌కు అత్యాధునాతన పరికరాలతోపాటు బాధితుడి ప్రాణాలు నిలబెట్టేందుకు వీలైన శస్త్రచికిత్సలను చేపట్టే సర్జన్లందరూ ఇక్కడ అందుబాటులో ఉంటారు.

ఇది తెలుసా..ట్రామా కేంద్రంలో అత్యవసర చికిత్స వల్ల మరణాలను 25 శాతం తగ్గించవచ్చు.ఆస్పత్రులకు వచ్చే బాధితుల్లో 24 శాతం రోడ్డు ప్రమాదాలకు సంబంధించినవే.!సకాలంలో ఆస్పత్రులకు చేర్చకపోవడంతో 40 శాతం మంది ప్రాణాలు కోల్పోతున్నారు.

ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 800కుపైగా ప్రమాదాల్లో సుమారుగా 350 మంది మరణించారు.

పోలీసుల లెక్కల ప్రకారం సగటున రోజుకు 8 చోట్ల ప్రమాదాలు జరిగి 20 మంది గాయపడుతున్నారు.

## చెబితే వినరు.. దూకుడు ఆపరు!

హైదరాబాద్ : నగరంలోని రోడ్ల మీద 10–15 ఏళ్ల బాలబాలికలు కార్లు, ద్విచక్రవాహనాలపై దూసుకెళ్తున్నారు. సీటుబెల్టు, శిరస్త్రాణం ధరించరు. ర్యాష్‌డ్రైవింగ్, ఆపసవ్యదిశలో ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ ఏడాది 8 నెలల వ్యవధిలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 10కి పైగా మైనర్లే కారకులుగా పోలీసులు గుర్తించారు. శివారు ప్రాంతాలు, కాలనీల్లో జరిగే ఎన్నో ప్రమాదాలు ఠాణాకు చేరకుండానే రాజీ పడుతుంటారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనం నడుపుతున్న మైనర్లపై రోజుకు సగటున 10 కేసులు నమోదవుతున్నాయి. యజమానులపై కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నారు. మణికొండకు చెందిన పదో తరగతి విద్యార్థి. తల్లిదండ్రులకు తెలియకుండా కారు తీసుకొని బయటకు వచ్చాడు. ప్రాంతంలో అదుపుచేయలేక తల్లీకూతుళ్లను ఢీకొట్టాడు. హుమాయునగర్ ఠాణా పరిధిలో ద్విచక్రవాహనం నడుపుతున్న బాలుడు(14) అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక కూర్చున్న పిల్లాడి తండ్రి రోడ్డు మీద పడి మరణించాడు.

బాగ్‌లింగంపల్లికి చెందిన బాలుడు(16) స్నేహితులతో కలసి వేగంగా కారు నడుపుతూ కాలిబాటపై నడచుకుంటూ వెళ్తున్న ఇద్దరు ఇంటర్ విద్యార్థినులను ఢీకొట్టాడు. విషయం బయటకు రాగానే పోలీసులు



కేసు నమోదు చేశారు.

తెలియకుండానే బయటకు బండ్లుపిల్లలు ముచ్చట పడుతున్నారని కొందరు. హోదాకు గుర్తుగా ఉంటుందని మరికొంతమంది తల్లిదండ్రులు ఖరీదైన వాహనాలు కొనిస్తున్నారు. నగరంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో 8–10 తరగతి విద్యార్థులు 10శాతం మంది బైక్‌లపై రాకపోకలు సాగిస్తున్నారు. గతేడాదితో పోల్చితే బాలుర డ్రైవింగ్‌పై ఈ సంవత్సరం 50శాతం కేసులు అధికంగా నమోదయ్యాయి. మైనర్లకు వాహనాలిచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు.

## రేషన్ ఈ- కేవైసీకి మరో అవకాశం.. త్వరగా పూర్తి చేసుకోవాలని అధికారుల సూచన

భువనగిరి : ఆహారభద్రత కార్డుల ఈ- కేవైసీ నమోదుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఫిబ్రవరి 29తో గడువు ముగిసినప్పటికీ రేషన్ దుకాణాల్లో ప్రభుత్వ సూచన మేరకు ప్రస్తుతం ఈ-కేవైసీ ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం లబ్ధిదారుల్లో 74 శాతం మాత్రమే ఇప్పటి వరకు నమోదు చేసుకున్నారు. మిగిలిన వారి కోసం మరో అవకాశం ఉండకపోవచ్చని, త్వరగా ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 1,740 గ్రామ పంచాయతీలకు గానూ 2,081 రేషన్ దుకాణాలున్నాయి. ఇందులో మొత్తం 10,07,214 రేషన్ కార్డులుండగా, 29,85,553 మంది రేషన్ లబ్ధిదారులున్నారు. ఇంకా వివిధ కారణాల వల్ల 7,96,023 మంది ఈ కేవైసీ చేయించుకోనట్లుగా అధికారవర్గాలు తెలుపుతున్నాయి.

సంక్షేమ పథకాలు అర్హుల లబ్ధికే..

సంక్షేమ పథకాలు అర్హులకే అందించడానికి ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే రేషన్ కార్డులకు ఈ- కేవైసీ తప్పనిసరి చేసింది. దీని కోసం శాఖాపరంగా అవగాహన కార్యక్రమాలు సైతం చేపట్టారు. ఈ విషయమై తమకు అందుబాటులో ఉన్న రేషన్ దుకాణాలకు వెళ్లి ఈ కేవైసీ చేసుకోవాలని పౌరసరఫరాల అధికారులు సూచించారు. పలు దఫాలుగా అవకాశం ఇచ్చినా ఇంకా మిగిలిపోయిన కారణంగా ఎక్కువ మందికి నష్టం కలిగే అవకాశం ఉందని భావించిన ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో నమోదు చేసుకోవడానికి మరోమారు అవకాశం కల్పించింది. అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని అధికారులు కోరుతున్నారు.



ప్రధాన సమస్యలివే..వేలిముద్రలు పడక, సాంకేతిక సమస్యలతో కొంతమేర జాప్యం జరుగుతోంది. దీనికితోడు చిన్నారుల ఆధార్ నవీకరణ కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పలువురు వృద్ధుల వేలిముద్రలు పడటం లేదు. మీసేవా, ఆధార్ కేంద్రాలకు వెళ్లి నవీకరణ పూర్తి చేసుకున్నా ఈ కేవైసీ ప్రక్రియలో వేలిముద్రలు రావడంలేదు. వలస వెళ్లిన వారి కోసం అక్కడుండే రేషన్ షాపుల్లో ఈ కేవైసీ చేసుకునే వెసులుబాటు ఉన్నా కొందరు డీలర్లు తమ పరిధిలోని వారికే కేవైసీ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ కేవైసీ ఆవశ్యకత విషయమై రేషన్ డీలర్లకు, లబ్ధిదారులకు అధికారులు పలు రకాలుగా సూచనలు చేస్తూనే ఉన్నారు. అవకాశం ఉందికదా అని నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే రేషన్ దుకాణాలకు వెళ్లి ఈ కేవైసీ చేయించుకోవాలంటున్నారు.

## అక్రమాలపై కన్ను..!

నల్గొండ : కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు అమ్ముకోవడంతో పాటూ భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి సకాలంలో ఇవ్వాల్సిన సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వకుండా తాత్సారం చేస్తున్న మిల్లులపై అధికారులు కొరడా ఝులిపించారు. సూర్యాపేట జిల్లా అధికార యంత్రాంగం, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా మిల్లుల్లో అక్రమాలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్న తిరుమలగిరి, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, గరిడేపల్లి, తుంగతుర్తిలోని సుమారు 15 మిల్లులపై మంగళవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఇందులో సీఎంఆర్ బియ్యంతో పాటూ పలు మిల్లుల్లోని రికార్డుల్లో తప్పులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

కొంత మంది మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సుమారు రూ.300 కోట్ల మేర బియ్యం చెల్లింపుల్లో అక్రమాలు, అవకతవకలకు పాల్పడ్డారని కొంత మంది రాష్ట్ర ఉన్నతాధికారులకు, ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదులు చేయడంతో.. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశాలు అందినట్లు తెలిసింది. దీంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన కలెక్టరు వెంకట్‌రావు..గతం నుంచి పలు ఆరోపణలు ఉన్న మిల్లులపై దాడులు నిర్వహిస్తున్నారు. పోలీసుల పర్యవేక్షణలో విజిలెన్స్, పౌరసరఫరాలు, జిల్లా అధికార యంత్రాంగం అందరూ సంయుక్తంగా ఇంత పెద్ద మొత్తంలో ఏకకాలంలో దాడులు చేయడం ఇటీవలి కాలంలో ఇదే ప్రథమం. రాష్ట్ర వ్యాప్తంగా సీఎంఆర్ బియ్యం చెల్లింపుల్లో గతం నుంచి సూర్యాపేట జిల్లా అట్టడుగు స్థాయిలోనే ఉంది. సీఎంఆర్ బియ్యం చెల్లింపుల్లో అక్రమాలపై 'మారని తీరు...మరాడించరు వారు' అన్న శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే.

అదుపులో మిల్లర్ల సంఘ నాయకుడు..!

ప్రభుత్వానికి ఇవ్వాల్సిన వందల రూ.కోట్ల విలువైన బియ్యం ఎగవేతతో పాటూ తాజా యాసంగి సీజన్‌లో తన, బినామీలకు చెందిన సుమారు నాలుగు మిల్లుల్లో ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని తీసుకోకుండా ప్రయత్నాలు చేసిన జిల్లాకు చెందిన మిల్లర్ల సంఘం కీలక నాయకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నాలుగు మిల్లుల్లో కలిపి సదరు నేత సుమారు రూ.200 కోట్ల బియ్యం ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉందని సమాచారం. భారీగా బకాయిలతో పాటూ తాజా సీజన్‌లో అధికారులకు సహకరించకుండా ఉండటంతో జిల్లా అధికారులు సైతం రాష్ట్ర పెద్దలకు సమాచారం ఇవ్వడంతో హైదరాబాద్ కేంద్రంగా ఓ కీలక నాయకుడి ఆదేశంతో సదరు నేతను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఇందులో అధికార యంత్రాంగంతో పాటూ విజిలెన్స్ అధికారులు పాల్గొన్నట్లు తెలిసింది. అయితే సదరు నేతతో అంటకాగిన అధికారులు, నేతలు ఎవరనే దానిపైనా ఆరా తీస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో ఈ అక్రమాలపై విజిలెన్స్ కేసులు నమోదు చేయనున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. సదరు నాయకుడితో పాటూ గరిడేపల్లి, నేరేడుచర్ల, తిరుమలగిరి, తుంగతుర్తి, సూర్యాపేట గ్రామీణ మండలాల్లో అక్రమాలకు పాల్పడిన మిల్లులపైనా తీవ్ర చర్యలకు అధికారులు సిఫార్సులు చేస్తున్నారు. నాలుగైదేళ్ల పాటు ఇక్కడ పనిచేసిన ఓ అధికారి వత్తాసుతోనే సదరు నాయకుడు రూ.కోట్ల విలువైన బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వకుండా బహిరంగ మార్కెట్లో విక్రయించారని గతంలోనే ఆరోపణలు రాగా...హైదరాబాద్ స్థాయిలో పైరవీ ద్వారా వీటన్నింటినీ బహిర్గతం కాకుండా చూశారు. గతంలో బ్లాక్‌లిస్టులో పెట్టి తిరిగి ధాన్యం కేటాయింపులు చేస్తున్న మిల్లుల్లోనూ రికార్డులు అధికారులు సమగ్రంగా తనిఖీ చేస్తున్నారు.

# గనుల వ్యర్థాలు.. ఆదాయ నిక్షేపాలు



తాండూరు: జిల్లాలోని నాపరాళ్ల వ్యర్థాలను సిమెంటు కర్మాగారాలకు విక్రయిస్తే గనుల శాఖకు రూ.కోట్ల కొద్దీ ఆదాయం సమకూరే అవకాశం ఉంది. అయితే ఆ దిశగా అధికారులు దృష్టి సారించడం లేదు. ప్రస్తుతం ఇబ్బడిముబ్బడిగా కుప్పలు పేరుకుపోయాయి. దశాబ్దం క్రితమే ప్రతిపాదన నాపరాళ్ల వ్యర్థాలను సమీపంలోని సిమెంటు కర్మాగారాలకు విక్రయించి ఆదాయం పొందాలనే ప్రతిపాదన దశాబ్దం క్రితమే వచ్చింది. ఆ మేరకు గనుల శాఖ నాపరాళ్ల వ్యర్థాల విక్రయ విషయాన్ని ఉన్నతాధికారులకు పంపించారు. వీరు దస్త్రాన్ని ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించారు. అయితే ఇప్పటికీ సదరు దస్త్రానికి మోక్షం లభించలేదు.

సిమెంటు కర్మాగారాల యజమానుల మెలిక: దశాబ్దం కిందట గనుల శాఖ అధికారులు సీసీఐ, ఇండియా సిమెంట్స్, పెన్నా కర్మాగారాల యజమానులతో గనుల శాఖలోని ఉన్నతాధికారులు వ్యర్థాల కొనుగోలు విషయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వ్యర్థాలను వినియోగించి సిమెంటును ఉత్పత్తి చేయొచ్చని వివరించారు. వ్యర్థాలను సిమెంటు ఉత్పత్తికి వినియోగించడానికి తాము సిద్ధమే అని ఇండియా సిమెంట్స్ అంగీకారం తెలిపింది. అయితే తమకు వ్యర్థాలను ఉచితంగా ఇవ్వాలని పేర్కొంది. మిగిలిన కర్మాగారాలు కూడా అదే విషయాన్ని వెల్లడించాయి. దీనికి అధికారులు ససేమిరా అన్నారు. టన్ను నాపరాయికి చెల్లించే రాయల్టీలో నాణ్యతను బట్టి 30 నుంచి 50 శాతం చెల్లించాలని అధికారులు సూచించారు. పరిశీలిస్తామని కర్మాగారాల యజమానులన్నారు. వ్యర్థాలకు రాయల్టీని చెల్లించే ధరావత్తు నిర్ణయించాలని కోరుతూ ఉన్నతాధికారులకు దస్త్రాన్ని పంపించారు. అక్కడి నుంచి నిర్ణయం కోసం ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లింది. తరువాత కదలిక లేదు.వచ్చే ఆదాయం రూ.19.50కోట్ల నుంచి రూ.32.50 కోట్లు: రాయల్టీలో 30 నుంచి 50 శాతం వసూలయ్యే విధంగా వ్యర్థాలను విక్రయించినా గనుల శాఖకు రూ.19.50 కోట్ల నుంచి రూ.32.50 కోట్లు సమకూరే అవకాశం ఉంది. ప్రస్తుతం టన్ను నాపరాయికి రాయల్టీ ఫీజు రూ.130గా ఉంది. అయితే పెండింగులో ఉన్న దస్త్రానికి మోక్షం లభిస్తేనే ఇది జరుగుతుంది. ఆ మేరకు గనుల శాఖ కృషి చేయాల్సిన అవసరం ఉంది.

50 లక్షల మెట్రిక్ టన్నుల పైమాటే..తాండూరు మండలం మల్కాపూర్, కరణ్‌కోట, ఓగిపూరు, సంగెం కలాన్, బషీరాబాద్ మండలం నవల్గా, క్యాద్గిర, ఎక్మాయి గ్రామాల్లో వందల ఎకరాల్లో నాపరాయి గనులు ఉన్నాయి. ఇవే భూముల్లో 150కి పైబడి గనులు కొనసాగుతున్నాయి. యజమానులు కార్మికులతో నాపరాళ్లను పలకలుగా పైకి తీయించే సమయంలో, లోడింగ్ సమయంలో, యంత్రాలతో ప్రమాణాల మేరకు కత్తిరించినపుడు ముక్కలుగా మారుతున్నాయి. ట్రాక్టర్లు, టిప్పర్లలో నింపించిన వ్యర్థాలను గనుల గట్లు, ఖాళీ ప్రదేశాల్లో పోస్తూ వస్తున్నారు. ఇలా దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి కుప్పలుగా పోసుకుంటూ వచ్చినవి 50 లక్షల మెట్రిక్ టన్నులకు పైగానే పేరుకు పోయాయి.వీటిని తొలగిస్తే భూమి చదునుగా మారుతుంది. మళ్లీ నాపరాళ్లను వెలికి తీసే గనులుగా మార్చవచ్చు. రాయల్టీల రూపంలో అదనంగా ఆదాయం పొందొచ్చు.

# రైల్వేస్టేషన్లలో మురుగు నీటి రీసైక్లింగ్..



హైదరాబాద్: ఎండలు మండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటాయి. నగరంలో నీటి కటకట ఏర్పడడంతో ఉద్యానాలు ఎండిపోతున్నాయి. దీనికంతటికీ కారణం నీరు తగినంత లేకపోవడమేనని సమాధానం వస్తుంది. కానీ దక్షిణమధ్య రైల్వే అలాంటి మాటకు తావులేదంటోంది. రైళ్లను కడిగిన నీటితో పాటు.. సాధారణ అవసరాలకు వినియోగించే నీటిని వృథా చేయకుండా.. శుద్ధిచేసి మళ్లీ వాడుతోంది. ఇప్పటికే సికింద్రాబాద్, కాచిగూడ, హైదరాబాద్ స్టేషన్లలో మురుగునీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయగా.. తాజాగా చర్లపల్లి రైల్వే స్టేషన్లోనూ సిద్ధం చేస్తోంది.

సికింద్రాబాద్‌లో ప్రప్రథమం..

భారతీయ రైల్వేలోనే మొట్టమొదటి మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్లో ఏర్పాటు చేశారు. ఇక్కడి ప్రయోగాలు, తద్వారా ఒనగూరిన ప్రయోజనాలు.. దేశంలోని ముఖ్యమైన రైల్వేస్టేషన్లలో కేంద్రాల ఏర్పాటుకు ఊతమిచ్చింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్లో రోజుకు 1.50 లక్షల లీటర్ల నీటిని ఇలా ఉత్పత్తి చేస్తున్నారు. కాచిగూడలో 1.50లక్షల లీటర్లు.. హైదరాబాద్ రైల్వేస్టేషన్లో 2 లక్షల లీటర్ల నీటిని ఈ మురుగునీటి శుద్ధి ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి చేస్తున్నారు. ఇప్పుడు చర్లపల్లి రైల్వేస్టేషన్లో కూడా రోజుకు 2 లక్షల లీటర్లను ఉత్పత్తి చేసేలా మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

శుద్ధి చేసిన జలాలతో..రైల్వేస్టేషన్లలో శుద్ధి చేసిన నీటితో ఉద్యానాల నిర్వహణ, మొక్కలకు నీళ్లు అందిస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే రైళ్లను కడగడానికి, ప్లాట్‌ఫాంలు, రైల్వే ట్రాక్‌లను కడిగేందుకు వినియోగిస్తున్నారు. మళ్లీ అదే నీటిని ఒడిసి పట్టి మురుగునీటి శుద్ధి ప్లాంట్‌కు చేరేలా ఏర్పాట్లు చేశారు. మూడు రైల్వేస్టేషన్లలో నీటిశుద్ధి కేంద్రాల ద్వారా 5 లక్షల లీటర్ల నీటిని అందుబాటులోకి తెచ్చి.. వృథాకు అడ్డుకట్ట వేయడమే కాకుండా.. లక్షల లీటర్లను పొదుపు చేస్తున్నారు. ఇలా రోజుకు 5 లక్షల లీటర్లను నీటిని పొదుపు చేయడమంటే.. నెలకు కనీసం రూ.10 లక్షలకు పైగా పొదుపు చేసినట్టవుతుందని అక్కడి ప్లాంట్ల నిర్వాహకులు చెప్పారు.

సిటీ డిపోల్లో నీటి కటకట

బస్సులు కడిగేందుకు నీళ్ల కరవు

తుడుస్తూ సరిపెడుతున్న వైనం

నగరంలో నీటి కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు ఎండిపోయాయి. దీంతో నీటితో కడిగే దగ్గర తడి వస్త్రంతో తుడుస్తున్నారు. ఇందుకు నగరంలో తిరిగే బస్సులు సైతం అతీతం కాదు. ప్రతి డిపోలో బస్సులను నీటితో శుభ్రం చేసే వ్యవస్థలున్నాయి. కానీ నీటికొరత వల్ల అవి పని చేయడంలేదు. దీంతో బస్సులు దుమ్ముకొట్టుకు పోవడంతో సిటీ బస్సుల్లో ప్రయాణించే మొదటి ప్రయాణికుడు సీటును తుడుచుకుని కూర్చోవాల్సి వస్తోంది.

తుడుస్తున్నా తొలగని దుమ్ము.. డిపోలకు చేరిన బస్సులను మరుసటి రోజు శుభ్రంగా కడిగేవారు. వారానికి ఒకసారి బస్సును మొత్తం కడిగి తుడుస్తారు. నీరు పుష్కలంగా ఉన్నప్పుడే బస్సుల శుభ్రత అంతంత మాత్రంగా ఉండేది. ప్రస్తుతం నీరు లేకపోవడంతో బస్సు లోపలి భాగంలో తుడుస్తున్నారు. ఇది సైతం వారం పది రోజులకోసారి చేస్తుండడంతో సీట్లన్నీ దుమ్ముకొట్టుకుపోతున్నాయి. నగర శివారు డిపోల్లో బోర్లు పని చేస్తుండడంతో షెడ్యూల్ ప్రకారం తుడుస్తున్నామని చెబుతున్నారు. కొన్ని డిపోల్లో ట్యాంకర్ల ద్వారా నీళ్లు తెస్తున్నప్పటికీ వారానికోసారి బస్సు బయట శుభ్రం చేసి వదిలేస్తున్నారు. లోపల వైపు తుడవడంతో ఆ దుమ్ము బస్సు సీట్లపై పడి ప్రయాణికులకు ఇబ్బందిగా మారుతున్నాయి.

# గౌరవ వేతనం జాడేది?

కరీంనగర్ : నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏటా అంబేడ్కర్ స్టేడియం వేదికగా ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను అట్టహాసంగా నిర్వహిస్తుంటారు. నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తల్లిదండ్రులు పిల్లలను ఇక్కడకు పంపిస్తుంటారు. గతేడాది మే, జూన్ నెలలో నిర్వహించిన శిక్షణ శిబిరాల్లో సుమారు 2500 మంది చిన్నారులు శిక్షణ పొందారు. పిల్లలకు శిక్షణ ఇచ్చేందుకు సుమారు 70 మంది కోచ్‌లను క్రీడా శాఖ ఎంపిక చేసింది. శిక్షణ కాలంలో కోచ్‌లకు గౌరవ వేతనంగా కొంత మొత్తాన్ని నగరపాలక సంస్థ ఇస్తోంది. గత వేసవి క్రీడా శిబిరంలో కోచ్‌లకు గౌరవ వేతనం ఇప్పటికీ అందలేదు.పట్టించుకునే వారు కరవు.. కరీంనగర్ బల్దియా ఆధ్వర్యంలో 2023 మే 5 నుంచి జూన్ 7 వరకు 28 అంశాల్లో శిక్షణ ఇచ్చారు. అనంతరం కోచ్‌లకు గౌరవ వేతనం ఇవ్వడం ఆనవాయితీ. వేసవి సెలవుల్లో అందరూ విహారయాత్రలకు వెళ్తుంటే 70 మంది కోచ్‌లు మాత్రం విద్యారులకు క్రీడా నైపుణ్యాలను అందించారు. శిబిరం ముగిసిన తర్వాత వారిని పట్టించుకునే వారే కరవయ్యారు. మళ్లీ వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా గౌరవ వేతనం ఇవ్వాలని కోచ్‌లు కోరుకుంటున్నారు. తామందరం ప్రైవేటు పాఠశాలల్లో పీఈటీలుగా, క్రీడలకు



కోచ్‌లుగా చాలీచాలని జీతాలతో పని చేస్తున్నామని మొర పెట్టుకున్నా అధికారులు ఆలకించలేదని కోచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేయర్, డీవైఎస్‌వో, జిల్లా ఒలింపిక్ సంఘం బాధ్యులకు విన్నవించుకున్నా లాభం లేదని వాపోతున్నారు. 2018, 2019లో నిర్వహించిన శిబిరాల్లో పాల్గొన్న కోచ్‌లకు ఆరు నెలలు గడిచిన తర్వాత గౌరవ వేతనం ఇచ్చారు. తర్వాత కరోనా కారణంగా శిబిరాలు నిర్వహించలేదు. గతేడాది 2022లో నిర్వహించగా.. ఇప్పటికీ ఇవ్వలేదు.

# బస్తాలు రాక.. లక్ష్యం నెరవేరక..!

మిర్యాలగూడ : కస్టమ్ మిల్లింగ్ బియ్యం తిరిగి ఇచ్చేందుకు ఉమ్మడి జిల్లాలోని పలు రైస్‌మిల్లులకు బస్తాల సమస్య నెలకొంది. ఖరీఫ్ ధాన్యంతో పౌరసరఫరాల శాఖ సరఫరా చేసిన బస్తాలకు కాప్రా పురుగు పట్టడంతో (సన్నని తెల్లపురుగు).. ఈ బస్తాల్లో కస్టమ్ మిల్లింగ్ బియ్యాన్ని భారత ఆహార సంస్థకు లెవీ పెట్టేందుకు మిల్లర్లు ముందుకు రావటం లేదు. పురుగు వచ్చిన బస్తాల్లో భారత ఆహార సంస్థకు బియ్యాన్ని మిల్లర్లు పంపితే వారు వెంటనే తిరస్కరిస్తున్నారు.

పంపిణీ విధానం ఇలా..పౌరసరఫరాల శాఖ ఐకేపీ కేంద్రాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని 54 శాతం కొత్త బస్తాలు, 46 శాతం పాత బస్తాల్లో మిల్లులకు ధాన్యం లారీల్లో లోడు చేసి పంపుతున్నారు. ధాన్యం మరపట్టిన తరువాత లెవీగా భారత ఆహార సంస్థకు కొత్త బస్తాల్లో నింపి అందించాలి. కొత్త బస్తాలపై ఏసీకే నంబర్లు ముద్రించి మిల్లర్లు లెవీ పెట్టాల్సి ఉంది. గత ఖరీఫ్ ధాన్యం లెవీ పెట్టే విషయంలో జాప్యం అవుతుండగా ప్రస్తుతం ఈ బస్తాల్లో పురుగులు రావటంతో మిల్లర్లు సరఫరా చేయలేకపోతున్నారు. తమకు కొత్తగా బస్తాలు ఇవ్వాలంటూ జిల్లా పౌరసరఫరాల శాఖకు, కలెక్టర్‌కు వినతి పత్రాలు అందిస్తున్నారు. భారత ఆహార సంస్థ నుంచి లెవీకి అనుమతి వచ్చే విషయంలో జరుగుతున్న జాప్యంతో తమ వద్ద నిల్వ ఉంచిన



ధాన్యం మిల్లింగ్‌కు కూడా పనికిరాకుండా పోతుందని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుమతి వచ్చిన సమయంలో బస్తాలు ఖాళీ చేసి ధాన్యం మిల్లింగ్ చేసి బియ్యం చేస్తున్నారు.

గతంలో కోటా ఇవ్వని వారికి కొత్త బస్తాలు..

– వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాల అధికారి, నల్గొండ

ఖరీఫ్ ఐకేపీ ధాన్యం మిల్లులకు పంపిణీ చేసే సమయంలో 54 శాతం కొత్త బస్తాలు ఇవ్వని వారికి మాత్రమే కొత్త బస్తాలు ఇచ్చేందుకు జిల్లా కలెక్టర్ అనుమతించారు. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ డీఎం పరిశీలించి కొత్త బస్తాలు ఇస్తున్నారు. అన్ని మిల్లులకు గతంలో పంపిన కొత్త బస్తాలను శుభ్రం చేయించి ఎఫ్‌సీఐకి లెవీ పెట్టాలి.

# నిత్యం రక్తసిక్తం..!

సూర్యాపేట : జాతీయ, ప్రధాన రహదారులు నిత్యం రక్తమోడుతున్నాయి. వాహనాల అతివేగం, చోదకుల నిర్లక్ష్యం అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నాయి. ఒక్కరు చేసిన పాపానికి ఎందరో తనువు చాలిస్తున్నారు. తల్లిదండ్రులకు ఆసరా అవుతారనుకున్న కుమారులు దూరమై పుట్టెడు శోకాన్ని మిగులుస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో రోజూ ఎక్కడో చోట రహదారి ప్రమాదం జరుగుతూనే ఉంది. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా జనవరి నుంచి ఏప్రిల్ 11 వరకు 102 రోజుల వ్యవధిలోనే 91 మంది మృత్యువాత పడినట్లు పోలీసుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సూర్యాపేట పురపాలిక పరిధిలో ఈ నెల 4 నుంచి 11 వరకు తొమ్మిది రోజుల వ్యవధిలో జరిగిన వేర్వేరుగా రోడ్డు ప్రమాదాల్లో 13 మంది దుర్మరణం చెందడం విస్మయం కలిగిస్తోంది. ప్రధానంగా వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం, అతివేగం వల్ల జరిగిన ప్రమాదాలే ఎక్కువ.

ఈ నెలలో జరిగిన దుర్ఘటనలు ఇవీ..

ఈ నెల 3న కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామం బస్టాండ్ సమీపంలో 65వ నంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆత్మకూర్(ఎస్) మండలం ఇస్తాళాపురం గ్రామానికి చెందిన మహిళ దుర్మరణం.

4న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మానసనగర్ సమీపంలో కారు, ఆటో, లారీ ఢీకొన్న ఘటనలో ఆరుగురు మృత్యువాత.

5న సూర్యాపేట మండలం రాయినిగూడెం సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

7న చిలుకూరు మండలంలోని కవిత జూనియర్ కళాశాల సమీపంలో



వాహనాన్ని లారీ ఢీ కొట్టిన ఘటనలో వ్యక్తి మరణం.

8న సూర్యాపేట మండలం రాజునాయక్‌తండా సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో అర్వపల్లి మండలం కొమ్మాల గ్రామానికి చెందిన యువకుడి దుర్మరణం.

9న సూర్యాపేట నుంచి స్వగ్రామం పిల్లలమర్రి గ్రామం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో యువకుడి మృతి.

9న ఆత్మకూర్ మండలం పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన బాలుడు ట్రాక్టర్ నడుపుతూ అదుపుతప్పి మృతి.

11న సూర్యాపేట మండలం రాయినిగూడెం సమీపంలో జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం.

11న సూర్యాపేట పట్టణంలోని జాతీయ రహదారి వంతెనపైన డీసీఎంను వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు.

కఠిన చర్యలు

–రాహుల్ హెగ్డే, ఎస్పీ, సూర్యాపేట

వాహనదారులు నిబంధనలు పాటించాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో వాహన తనిఖీలను విస్తృతం చేశాం. పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం, ఇష్టారీతిన రాకపోకలు సాగించడం మార్చుకోవాలి.



# ముంపు నుంచి బయట పడుతున్న కాలనీలు - ముమ్మరంగా సహాయక చర్యలు

విజయవాడ: నగరంలోని పలు కాలనీలు వరద ముంపు నుంచి బయటకొస్తున్నాయి. అగ్నిమాపక, పారిశుద్ధ్య సిబ్బంది పలు చోట్ల బురదను తొలగిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి 113 ఫైరింజన్లు విజయవాడకు చేరుకున్నాయి. ఇప్పటికే 50 ఫైరింజన్ల ద్వారా సిబ్బంది ఇళ్లలోని మట్టిని తొలగిస్తున్నారు. 54వ డివిజన్‌లో పారిశుద్ధ్య పనులను మంత్రి సవిత పర్యవేక్షించారు. విజయవాడలోని మొత్తం 32 డివిజన్లలో పలు ప్రాంతాలు ముంపునకు గురైనట్లు అధికారులు గుర్తించారు.

**పైప్‌లైన్ నీటిని తాగొద్దు...** పైపులైన్ ద్వారా సరఫరా చేస్తున్న నీటిని తాగొద్దని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు.

విజయవాడలోని 32 డివిజన్లతో పాటు సమీప 5 గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ 200 రకాల మందులు అందుబాటులో ఉంచారు.


**సింగ్ నగర్ నుంచి ఉచిత బస్సులు :** వరద ప్రభావిత ప్రాంతం అజిత్‌సింగ్ నగర్‌లో ఆర్టీసీ ఉచిత బస్సులు అందుబాటులో ఉంచారు. ఇక్కడి నుంచి విజయవాడలోని పలు ప్రాంతాలకు 6 బస్సులు వెళు తున్నాయి. మరోవైపు బుడమేరు వద్ద గండ్లు పూడ్చే పనిలో జలవనరుల శాఖ నిమగ్నమైంది. వర్షంలోనూ ఇక్కడ పనులు కొనసాగుతున్నాయి.




# సీఎం చంద్రబాబుకు అతి సమీపంగా వచ్చిన రైలు.. తృటిలో తప్పిన ప్రమాదం!

**విజయవాడ పరిధిలోని మధురానగర్‌లో వరద ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. వరదను పరిశీలించేందుకు రైలు వంతెన పైకి సీఎం వెళ్లారు. బ్రిడ్జిపై నడిచి బుడమేరు ఉధృతిని చంద్రబాబు పరిశీలించారు. రైలు వంతెనపై ఆయన నడుస్తుండగానే రైలు ఎదురుగా రావడంతో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. చంద్రబాబుకు అతి సమీపంగా రైలు వెళ్లింది. రైలు తగలకుండా సీఎం ఓ పక్కకు నిలబడి ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. రైలు వెళ్లిపోయాక అధికారులు, భద్రతా సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.**

# ఒకరికొకరు అభినందనలు.. ఇది బాండింగ్ అంటే..



అమరావతి ప్రస్తుతం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల మధ్య ఉన్న బాండింగ్ గురించి ప్రతి రోజూ వార్తలు వినబడుతూనే ఉన్నాయి. ఎన్నికలలో విజయం అనంతరం.. వీరిద్దరూ ప్రతి విషయంలో చూపుతున్న చొరవ, ముఖ్యంగా పవన్ కళ్యాణ్‌కు చంద్రబాబు ఇస్తోన్న ప్రాముఖ్యత ఏంటనేది ప్రత్యక్షంగా అంతా చూస్తూనే ఉన్నారు.

అలాగే పవన్ కళ్యాణ్ కూడా ప్రతి విషయంలో చంద్రబాబుగారే స్ఫూర్తి అనేలా ముందుకు వెళుతున్నారు. అలా వీరి బాండింగ్‌ని చూసి ఇతర పార్టీలు సైతం కుళ్లుకునే పరిస్థితి నేడు ఏపీలో ఉందంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరమే లేదు. తాజాగా పవన్ కళ్యాణ్ చేసిన రూ. 6 కోట్ల విరాళంపై చంద్రబాబు ప్రశంసలు కురిపిస్తూ, అభినందనలు తెలియజేస్తే.. ఈ విపత్కర పరిస్థితుల్లో చంద్రబాబు పాలనా దక్షత, విధి నిర్వహణను పవన్ కళ్యాణ్ కొనియాడారు. ప్రస్తుతం వారి ట్వీట్స్ వైరల్ అవుతున్నాయి. ట్విట్టర్ 'ఎక్స్' వేదికగా జరిగిన వారి సంభాషణ ఇదే.. "వరద ప్రాంత ప్రజల కోసం ఎంతో ఉదాత్తంగా భారీ విరాళం ప్రకటించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌కు నా అభినందనలు. ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.కోటి, వరద బారిన పడ్డ 400 పంచాయితీలకు రూ.4 కోట్లు, తెలంగాణ వరద ప్రాంతాలలో సహాయ కార్యక్రమాలు చేసేందుకు మరో రూ.కోటి ఇవ్వడం ఆయన విశాల హృదయానికి అద్దం పడుతున్నది. దాతృత్వాన్ని ప్రదర్శించడంలో తనకు తానే సాటిగా ప్రవర్తించే పవన్ కళ్యాణ్ సమాజంలో ఎందరికో స్ఫూర్తినిస్తున్నారు. ప్రజలకు ఆయన చేస్తున్న సేవలకు విలువ కట్టలేం. అదే విధంగా ఆయన కురిపిస్తున్న వాత్సల్యానికి ఏదీ సరితూగదు. ఆయనకు మరోసారి ధన్యవాదాలు తెలుపుతున్నాను.." అని ఏపీ సీఎం చంద్రబాబు ట్వీట్‌లో పేర్కొన్నారు.




# ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి మరీ పరారైన జోగి రమేష్, దేవినేని అవినాష్

అమరావతి: టీడీపీ కేంద్ర కార్యాలయంతో పాటు చంద్రబాబు నివాసంపై దాడి కేసులో నిందితులు కోసం ప్రత్యేక పోలీస్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఎల్. అప్పిరెడ్డి, దేవినేని అవినాష్, తలశిల రఘురాం, జోగి రమేష్ కోసం ప్రత్యేక పోలీస్ బృందాలను పోలీసులు పంపించడం జరిగింది. వైసీపీ రాష్ట్ర యువత అధ్యక్షులు పానుగంటి చైతన్య కోసం వేట సాగిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజే చైతన్య పరారయ్యాడు. ఇప్పటికే మాజీ ఎంపీ నందిగాం సురేష్, విజయవాడ నగర వైసీపీ నేత అవుతు శ్రీనివాస రెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో మిగిలిన నిందితుల్లో ఆందోళన ప్రారంభమైంది. మంగళగిరి పోలీస్ స్టేషన్‌లో పెట్టి మరీ పోలీసులు విచారిస్తున్నారు. జోగి రమేష్, దేవినేని అవినాష్, అప్పిరెడ్డి, రఘురామ్‌లు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి మరీ పరారయ్యారు. ఇందులో కొందరి ఆచూకీని పోలీసులు కనిపెట్టినట్టుగా సమాచారం. చంద్రబాబు నివాసంపై దాడి కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ కు కూడా నిన్న ముందస్తు బెయిల్‌ను ఏపీ హైకోర్టు తిరస్కరించింది. జోగి కూడా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి పరారయ్యారు. జోగి కోసం కూడా ప్రత్యేక బృందాలు అన్వేషణ సాగిస్తున్నాయి. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో దేవినేని అవినాష్, అప్పిరెడ్డి, నందిగాం సురేష్, తలశిల రఘురామ్ సహా మరో 14 మంది నిందితులుగా ఉన్నారు. వీరంతా తమను అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం.. బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. అరెస్ట్ నుంచి రక్షణ కల్పించే ప్రసక్తే లేదని ఏపీ హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.




# వైకాపా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అరెస్ట్

గుంటూరు: వైకాపా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని మంగళగిరి పోలీసులు అరెస్టు చేశారు. తెదేపా కార్యాలయంపై దాడి కేసులో ఆయన్ను పోలీసులు అందుపులోకి తీసుకున్నారు. ఇదే కేసులో ఇప్పటికే బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వైకాపా నేతలు దేవినేని అవినాష్, తలశిల రఘురామ్ తదితరుల కోసం గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పోలీసులతో కలిపి 12 బృందాలను ఏర్పాటుచేశారు. హైకోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించడంతో నిందితులంతా అజ్ఞాతంలోకి వెళ్లారు.

# ఏలూరులో వైసీపీకి ఊహించని షాక్!




అమరావతి, సెప్టెంబర్ 5: ఏపీలో వైసీపీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతూనే ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితం చేసి ఏపీ ప్రజలు ఇచ్చిన బిగ్ షాక్ నుంచి కోలుకోకముందే.. నేతలు సైతం ఒక్కొక్కరుగా పార్టీని వీడుతుండటంతో వైసీపీని మరింత షాక్‌లోకి నెట్టేస్తోంది. ఇప్పటికే పలువురు ముఖ్య నేతలు, సీనియర్లు పార్టీకి టాటా చెప్పేసిన పరిస్థితి. ఈక్రమంలో ఏలూరులో వైసీపీకి మరో పెద్ద షాక్ తగిలింది. పార్టీ నేత గంటా ప్రసాద రావు పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. వైసీపీ సభ్యత్వానికి, జిల్లా వైసీపీ బీసీ సెల్ అధ్యక్ష పదవికి గంటా ప్రసాదరావు రాజీనామా చేశారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రాజీనామా లేఖను గంటా ప్రసాద్ పంపించారు. ప్రస్తుతం జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఆయన భార్య గంటా పద్మశ్రీ బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. త్వరలోనే ఆమె కూడా వైసీపీకి రాజీనామా చేయనున్నారనే ప్రచారం జోరుగా వినిపిస్తోంది. వైసీపీకి రాజీనామా చేసిన గంటా ప్రసాదరావు టీడీపీ లేదా జనసేనలో చేరే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా... ఎన్నికల తర్వాత అనేక మంది నేతల పార్టీని వీడిన విషయం తెలిసిందే. ఆళ్ల నాని, మోపిదేవి, బీద మస్తాన్ ఇలా ఒక్కొక్కరుగా పార్టీకి దూరం అవుతూ వస్తున్నారు. వైసీపీని వీడిన వారంతా బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల్లో చేరిపోతున్నారు కూడా. ఇటీవల సీనియర్ నేత, జగన్‌కు అత్యంత నమ్మకస్తుడిగా ఉన్న ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని) పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. ఏలూరు జిల్లా అధ్యక్ష పదవితో పాటు నియోజకవర్గ ఇంఛార్జ్ పదవికి కూడా ఆళ్ల రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతోనే పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇకపై తాను ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి నాని పంపారు. మరోవైపు మూడు రోజుల క్రితం ఏలూరులో వైసీపీ కార్పొరేటర్లు సైతం అధినేతకు షాకిచ్చారు. గత నెలలో దాదాపు 14 మంది వైసీపీ నుంచి గెలిచిన కార్పొరేటర్లు, మహిళా కోఆప్షన్ సభ్యురాలు వైసీపీకి ప్రాథమిక సభ్యత్వాలకు రాజీనామా చేశారు. వీరంతా ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సమక్షంలో టీడీపీ తీర్థం తీసుకున్నారు. అంతకు ముందే మేయర్ కొందరు కార్పొరేటర్లు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ గూటికి చేరిపోయారు.

అయితే భారీ పరాజయం నుంచే ఇంకా కోలుకోని అధినేత జగన్‌ను... ఇలా పార్టీ నుంచి పెద్ద సంఖ్యలో నేతలు వెళ్లిపోతుండటం మింగుపడని విషయంగా మారింది. మరి మిగిలిన నేతలైనా జగన్ ఏ రకంగా కాపాడుకుంటారో చూడాలి మరి.

# వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేశ్ అరెస్ట్



హైదరాబాద్: వైకాపా నేత, బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లో ఆయన్ను అరెస్ట్ చేసి గుంటూరు జిల్లా మంగళగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అమరావతిలోని తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ఆయనతో పాటు మరికొందరు వైకాపా నేతలపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని వారు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. దీంతో సురేశ్‌ను అరెస్టు చేసేందుకు బుధవారం ఉద్దండరాయునిపాలెంలోని ఆయన ఇంటికి తుళ్లూరు పోలీసులు వెళ్లారు. దాదాపు 15 నిమిషాలు అక్కడే వేచి చూశారు. అక్కడ లేరని తెలియడంతో వెనుదిరిగారు. అరెస్టు భయంతో సురేశ్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయి సెల్‌ఫోన్ స్విచాఫ్ చేశారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా బుధవారం ఉదయం నుంచి ఆయన ఎక్కడున్నారో పోలీసులు విచారణ చేపట్టారు. హైదరాబాద్ వెళ్లి అక్కడి నుంచి పారిపోయేందుకు యత్నిస్తున్నారనే సమాచారంతో ఏపీ పోలీసులు అక్కడికి వెళ్లారు. పక్కా సమాచారంతో అక్కడ ఆయన్ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న వైకాపా నేతలు లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాష్, తలశిల రఘురామ్, నందిగం సురేష్ తదితరుల కోసం గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పోలీసులతో కలిపి 12 బృందాలను ఏర్పాటుచేశారు. మరోవైపు ఇదే కేసులో నిందితుడిగా ఉన్న విజయవాడ డిప్యూటీ మేయర్ శైలజ భర్త శ్రీనివాసరెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఇతర నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది.

# ప్రకాశం బ్యారేజీ 67, 69 గేట్లకు మరమ్మతు పనులు షురూ



విజయవాడ, సెప్టెంబర్ 5: ప్రకాశం బ్యారేజీ వద్ద దెబ్బతిన్న గేట్లకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. నిపుణుల పర్యవేక్షణలో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ప్రకాశం బ్యారేజ్ 67, 69 నెంబర్ గేట్లకు మరమ్మతు పనులు సాగుతున్నాయి. బ్యారేజ్ 69వ గేటు వద్ద పడవ ఢీకొని కౌంటర్ వెయిట్ దెబ్బతిన్న విషయం తెలిసిందే. నిపుణులు కన్నయ్యనాయుడు పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. చీఫ్ ఇంజినీర్ తోట రత్నకుమార్ ఈ పనులు పర్యవేక్షిస్తున్నారు. సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్, డ్యామ్ సేఫ్టీ చీఫ్ ఇంజినీర్‌గా రత్నకుమార్ ఉన్నారు. అలాగే ఇరిగేషన్ శాఖ అడ్వైజర్ కె.వి.కృష్ణారావు కూడా మరమ్మతు పనులు పర్యవేక్షిస్తున్నారు. విజయవాడ సీతానగరం పీడబ్ల్యూ వర్క్‌షాప్ రిటైర్డ్ ఇంజినీర్ కె.వి.కృష్ణారావు పర్యవేక్షణలో పనులు సాగుతున్నాయి. సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఈఈ ఇంజినీర్ విజయసారథి మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్నారు.

**దెబ్బతిన్న కౌంటర్ వెయింట్లు..** కాగా.. రెండు రోజు క్రితం కృష్ణా నదికి ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతికి కొట్టుకొచ్చిన ఇనుప బోట్ల కారణంగా ప్రకాశం బ్యారేజీ గేట్లకు అనుబంధంగా ఉండే కౌంటర్ వెయింట్లు దెబ్బతిన్నాయి. 64వ నంబరు గేటు వద్ద ఉండే వెయిట్ స్వల్పంగా దెబ్బతినగా.. 69వ గేటు వద్ద ఉండేది పూర్తిగా మధ్యకు విరిగిపోయింది. కాంక్రీట్ సిమెంట్ దిమ్మకు లోపల ఉండే ఇనుప చువ్వలు బయటకు వచ్చేశాయి. ఈనెల 2న కృష్ణా నదికి రికార్డు స్థాయిలో వరద పోటెత్తిన విషయం తెలిసిందే. ఎగువన భవానీపురం, గొల్లపూడి, ఇబ్రహీపట్నం ప్రాంతాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లి బోట్లకు లంగరేశారు. వరద ఉధృతికి వీటిలో 4 బోట్లు కొట్టుకొచ్చాయి. ఇందులో ఒక బోటు 69వ గేటు వద్ద ఉన్న కౌంటర్ వెయిట్‌ను ఢీ కొట్టడంతో విరిగిపోయి ఇరుక్కుపోయింది. ఈ బోటును ఢీ కొని మరో రెండు బోట్లు ఆగిపోయాయి. మరో బోటు 64వ నంబరు ఖానా వద్ద ఉన్న కౌంటర్ వెయిట్‌ను ఢీ కొట్టడంతో స్వల్పంగా దెబ్బతింది. ఈ బోటూ ఇక్కడ ఇరుక్కుపోయింది. విషయం తెలిసిన ప్రభుత్వం... జలవనరుల శాఖ సలహాదారు, గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడి పిలుపించగా.. అదే రోజు రాత్రి ఆయన హుటాహుటిన బ్యారేజీ వద్దకు చేరుకుని విరిగిన గేట్లను పరిశీలించారు. ఈ రెండు చోట్ల గేట్లకు నష్టంలేదని కూడా నిర్ధారించారు. గేట్లు విరిగి రోజే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం సాయంత్రానికి ప్రకాశం బ్యారేజీ వద్దకు వచ్చారు. బ్యారేజీకి ఈ వైపు నుంచి ఆ వైపు మొత్తం నడుచుకుంటూ వెళ్లి ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోను పరిశీలించారు. 64, 69వ ఖానాల వద్ద దెబ్బతిన్న కౌంటర్ వెయిట్లను చూశారు. ఆపై అధికారులతో సీఎం చంద్రబాబు చర్చలు జరిపారు.

# ఎమ్మెల్యేపై లైంగిక వేధింపుల ఆరోపణలు.. సస్పెండ్ చేసిన తెదేపా




అమరావతి: తిరుపతి జిల్లా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి.

ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబుకు ఓ మహిళ లేఖ రాశారు. ఎమ్మెల్యే వేధింపులను పెన్ కెమెరాలో రికార్డు చేసినట్లు ఆమె తెలిపారు. రాత్రి వేళల్లో మెసేజ్‌లు పంపి వేధించారని లేఖలో పేర్కొన్నారు. తిరుపతిలోని భీమాస్ ప్యారడైజ్ హొటల్‌కు పిలిపించి వేధించారని ఆరోపించారు.

ఈ ఘటనను తెదేపా అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది. ఎమ్మెల్యే ఆదిమూలంను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఈ మేరకు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. దీనిపై ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

## కియరా స్టన్నింగ్ బ్యాక్ లెస్ బాడీకాన్ లుక్

కియారా అద్వానీ నెవ్వర్ బిఫోర్ లుక్ తో హెడ్ టర్నర్ గా మారింది. ఈ బ్యూటీ లేటెస్ట్ క్ లెస్ బాడీకాన్ లుక్ కుర్రకారుకు చెమటలు పట్టిస్తోందంటే అతిశయోక్తి కాదు. కియరా ఫ్యాషన్ సెన్స్, బహిరంగ ప్రదర్శనలు, ఫోటోషూట్‌లు ఎప్పటికీ హాట్ టాపిక్స్. తాజాగా ఈ బ్యూటీ బ్యాక్‌లెస్ ఫాక్స్ లెదర్ వేషధారణలో మెరుపులు మెరిపించింది. స్మోకీ ఐస్... చంకీ యాక్సెసరీస్ తో కియరా స్టన్నర్ గా కనిపిస్తోంది. కియరా తో పాటు ఈ ఫోటోషూట్ లో హాట్ లేడీస్ కరీనా కపూర్ ఖాన్, సుహానా ఖాన్ కూడా ఉన్నారు. ప్రస్తుతం ఈ అద్భుతమైన ఫోటోషూట్ ఇంటర్నెట్ లో నిప్పులు చెరుగుతోంది. కియరా స్టన్నింగ్ లుక్ కి ఫ్యాన్స్ ఫిదా అయిపోయామని



ప్రశంసిస్తున్నారు. బ్యాక్ లెస్ బాడీ కాన్ లుక్ లో కియరా టూమచ్ హాలిగా ఉందంటూ కామెంట్ చేస్తున్నారు. తన కోసం లవ్, హార్ట్ ఈమోజీలను షేర్ చేస్తున్నారు. కియారా అద్వానీ ఇటీవల తన 33వ పుట్టినరోజును జరుపుకుంది. భర్త సిద్ధార్థ్ మల్హోత్రా నుండి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు అందుకోగా, అభిమానుల నుంచి విషెస్ వెల్లువెత్తాయి. జూలై 31, బుధవారం నాటికి కియరాకు 33 ఏళ్లు నిండాయి. కియరా పుట్టినరోజు సందర్భంగా శంకర్ గేమ్ ఛేంజర్ పోస్టర్‌ను విడుదల చేసారు. ప్రొడక్షన్ హౌస్ ఈ చిత్రంలో కియారా పాత్ర పేరు జాబిలమ్మ అని వెల్లడించింది. మరోవైపు కియారా క్యూలో వరుస సినిమాలు ఉన్నాయి. రణవీర్ సింగ్ సరసన కియరా డాన్ 3 లో నటించనుంది. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ నటిస్తున్న వార్ 2 లో కూడా కియరా ఒక కథానాయికగా నటిస్తోంది. వరుసగా క్రేజీ పాన్ ఇండియా చిత్రాలతో క్షణం తీరిక లేనంత బిజీగా ఉంది.

## అనసూయ హొయలు ఆ డ్రెస్సుకే అందం వచ్చేలా

యాంకర్ గా కెరియర్ స్టార్ట్ చేసిన అనసూయ క్షణం సినిమాతో మొదట నటిగా మంచి గుర్తింపు అందుకుంది. అంతకుముందు సోగ్గాడే చిన్ని నాయనా సినిమాలో గెస్ట్ అప్పీరియన్స్ ఇచ్చింది. ఇక రంగస్థలం సినిమాలో రంగమ్మత్త పాత్ర అయితే అనసూయని ఏకంగా స్టార్ యాక్టర్ గా మార్చేసింది. అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం లేకుండా వరుస సినిమాలతో అనసూయ బిజీ అయిపోయింది. అనసూయ నటించిన సింబ మూవీ రిలీజ్ కి రెడీ అవుతోంది. రీసెంట్ గా ఈ మూవీ ట్రైలర్ ప్రేక్షకుల ముందుకొచ్చింది. అలాగే పుష్ప ది రూల్ మూవీలో నటిస్తోంది. దాంతో పాటు ఫ్లాష్ బ్యాక్, ఉల్ఫ్ అని రెండు సినిమాలు షూటింగ్ దశలో ఉన్నాయి. కొన్ని మూవీస్ చర్చల దశలో ఉన్నట్లు తెలుస్తోంది. ఓ వైపు సినిమాలు చేస్తూనే అనసూయ టీవీ షోలకి జడ్జ్ గా ఈ మధ్యకాలంలో వస్తోంది. గతంలో హొస్ట్ గా అనసూయ చేసేది. పూర్తిగా యాంకరింగ్ కి గుడ్ బై చెప్పేసిన అనసూయ జడ్జ్ గా ప్రమోట్ అయ్యింది. స్టార్



మాలో శని, ఆదివారాలు ప్రసారం అయ్యే కిర్రాక్ బాయ్స్ ఖిలాడీ గర్ల్స్ అనే షోకి జడ్జ్ గా అనసూయ వస్తోంది. సోషల్ మీడియాలో ఈ అమ్మడు చాలా యాక్టివ్ గా ఉంటుంది. ముఖ్యంగా ఇన్ స్టాగ్రామ్ లో రెగ్యులర్ గా తన గ్లామర్ ఫోటోలని అనసూయ షేర్ చేసుకుంటూ ఉంటుంది. అలాగే తన ఫ్యామిలీ సెలబ్రేషన్స్, వెకేషన్స్ కి సంబందించిన పిక్స్ కూడా పంచుకుంటూ ఉంటుంది. ఇన్ స్టాగ్రామ్ లో అనసూయకి 1.5 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారు. ఈ బ్యూటీ గ్లామర్ ఫోటోలని ఫ్యాన్స్ తో పంచుకోవడమే కాకుండా సామాజిక అంశాల మీద కూడా అప్పుడప్పుడు రియాక్ట్ అవుతూ పోస్టులు పెడుతూ ఉంటుంది. ఇదిలా ఉంటే తాజాగా అనసూయ వైట్ కలర్ అవుట్ ఫిట్ తో అదిరిపోయే స్టన్నింగ్ లుక్స్ తో ఉన్న ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. ట్రెడిషనల్ స్టైల్ లో ఉన్న ఈ కాస్ట్యూమ్స్ అనసూయ అందాన్ని మరింతగా ఎస్టాబ్లిష్ చేస్తున్నాయని చెప్పొచ్చు. కిర్రాక్ బాయ్స్ ఖిలాడీ గర్ల్స్ షోకి ఈ లుక్ లో అనసూయ హాజరైనట్లు ఆమె పోస్ట్ బట్టి అర్ధమవుతోంది. స్టార్ మాలో శని, ఆదివారాలు ప్రసారం రాత్రి 9 గంటలకి ప్రసారం అయ్యే షోలో కలుద్దాం అంటూ ఈ ఫోటోలకి పోస్ట్ ని అనసూయ జతచేసింది.




## దేవర 'దావుడి' సాంగ్.. మాస్ విజిల్స్ పక్కా




యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా సినిమా 'దేవర' పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకు పెరుగుతోంది. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సాంగ్స్ కు హైప్ పెంచుతున్నాయి. "ఫియర్ సాంగ్" మరియు "చుట్టమల్లే" పాటలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో, ఇప్పుడు ఈ సినిమా నుంచి వచ్చే మూడో పాట కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూశారు. విడుదలైన "దావుడి" పాటతో ఆ ఎదురుచూపులకు తెరపడింది. ఈ పాపులర్ సాంగ్, అనిరుధ్ రవిచందర్ స్వరపరచిన క్యాచీ బీట్స్ తో నిండిన హై ఎనెర్జిటిక్ డ్యాన్స్ నెంబర్‌గా నిలిచింది. రామజోగయ్య శాస్త్రి అందించిన చమత్కారమైన లిరిక్స్ ఈ పాటకు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి, చూస్తుంటే మాస్ ఆడియెన్స్ చేత విజిల్స్ వేయించేలా ఉందని అనిపిస్తుంది. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు యూట్యూబ్ లో రికార్డ్ క్రియేట్ చేశాయి. ఇక దావుడి పాట కూడా అదే రేంజ్ లో క్లిక్కయేలా కనిపిస్తోంది. ఈ పాటను తెలుగు భాషలో నకాష్ అజీజ్ మరియు అకాసా తమ శక్తివంతమైన స్వరాలతో పాడారు. వారి గాత్రం పాటకు ఒక ప్రత్యేకమైన వైబ్‌ను ఇచ్చింది. ఎన్టీఆర్ మరియు జాన్వీ కపూర్ మధ్య ఉన్న కెమిస్ట్రీ, వారి డ్యాన్స్ మూవ్స్ పాటను ఒక అద్భుతమైన విజువల్ ఫీస్ట్‌గా మార్చాయి. ఈ పాటను అన్ని భాషల్లో అభిమానులు తెగ ఎంజాయ్ చేయడం పక్కా అని చెప్పవచ్చు. ఇక శేఖర్ మాస్టర్ నృత్య దర్శకత్వం వహించిన ఈ పాటను థియేటర్లలో అభిమానులు పండగలా సెలబ్రేట్ చేసే అవకాశం ఉంది. ఈ సినిమాను సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళం వంటి పలు భాషల్లో విడుదల చేయనున్నారు. అలాగే ఈ సినిమాలో ప్రకాశ్ రాజ్, శ్రీకాంత్, షైన్ టామ్ చాకో వంటి ప్రముఖ నటులు కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సైఫ్ అలీ ఖాన్ భైరా అనే విలన్ పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంపై బాలీవుడ్ లో కూడా మంచి హైప్ తో రిలీజ్ కాబోతోంది. ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్ లో కళ్యాణ్ రామ్ సమర్పణలో ఈ సినిమా రూపొందుతోంది. సుధాకర్ మిక్కిలినేని మరియు కొసరాజు హరికృష్ణ నిర్మాణంలో, యువసుధ ఆర్ట్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## మెకానిక్ రాకీ గ్లింప్స్.. డేంజర్ కే లైసెన్స్ వీడు!




యువ హీరో విశ్వక్ సేన్ నుంచి ఒక సినిమా వస్తోంది అంటే తప్పకుండా అందులో ఏదో ఒక న్యూ డిఫరెంట్ కాన్సెప్ట్ ఉంటుందని ఆడియెన్స్ లో నమ్మకం వచ్చేసింది. గామి సినిమాతోనే అతను నటుడిగా తానేంటో నిరూపించుకున్నాడు. ఇక రెగ్యులర్ గా ఒకే తరహాలో కాకుండా అన్ని వర్గాల ఆడియెన్స్ కు కనెక్ట్ అయ్యేలా కమర్షియల్ పాయింట్స్ ను కూడా టచ్ చేస్తున్నాడు. ఇప్పుడు విశ్వక్ నటిస్తున్న 'మెకానిక్ రాకీ' సౌండ్ మొదలైంది. ఇక చిత్రానికి సంబంధించిన గ్లింప్స్ ను ఫస్ట్ గేర్ అంటూ విడుదల చేశారు. రవితేజ ముల్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మాణంలో సారథ్యం వహిస్తున్న ఈ చిత్రంలో విశ్వక్ సేన్, మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. మొదటి సారి దర్శకత్వ బాధ్యతలు చేపట్టిన రవితేజ ముల్లపూడి ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. ఫస్ట్ గేర్ టీజర్ లో ప్రధాన పాత్రలతో పాటు ఈ చిత్రంలో ఉన్న ట్రయాంగిల్ లవ్ స్టోరీ అని రివీల్ చేశారు. విశ్వక్ సేన్ మెకానిక్ రాకీ గా కనిపించడంతో, అతని పాత్రలో ఉన్న మాస్ యాంగిల్, యాక్షన్ సీక్వెన్స్ ఆకట్టుకుంటున్నాయి. "చోటే చోటే బచ్చో కో పూరోం కీ మై జవాబ్ దేతూ..." అనే డైలాగ్ తో పాటు "డేంజర్ కే లైసెన్స్" అనే బ్యాక్ గ్రౌండ్ వాయిస్ విశ్వక్ సేన్ డైనమిక్ క్యారెక్టర్ ని హైలైట్ చేస్తున్నాయి. మీనాక్షి చౌదరి ఎథ్నిక్ వేర్ లో కూల్ గా కనిపిస్తుండగా, శ్రద్ధా శ్రీనాథ్ ఒక అర్బన్ లేడీ పాత్రలో అలరిస్తున్నారు. హీరోయిన్ మీనాక్షి విశ్వక్ సేన్ మధ్యలో వచ్చిన సీన్స్ చాలా ఫన్నీగా ఉండడం విశేషం. ఇక మిగతా నటీనటుల పాత్రలు కూడా పవర్ఫుల్ గా ఉండనున్నట్లు అర్థమవుతుంది. సునీల్, నరేష్, రోడీస్ రఘురాం పాత్రలు నెవ్వర్ బిఫోర్ అనేలా ఉండనున్నట్లు తెలుస్తోంది. అవి ప్రేక్షకులకు గుర్తుండిపోతాయి. రవితేజ ముల్లపూడి ఒక విభిన్నమైన కథతో, విశ్వక్ సేన్ క్యారెక్టర్ ను శక్తివంతంగా ప్రెజెంట్ చేయడం తన డైరెక్షన్ సత్తా చూపిస్తోంది. ఇక మనోజ్ కటసాని కెమెరా వర్క్ అద్భుతంగా ఉండగా, జేక్స్ బిజోయ్ మ్యూజిక్ ఈ సినిమాపై మరింత అంచనాలను పెంచుతుంది. ప్రొడక్షన్ డిజైన్ కూడా టాప్ క్లాస్ గా ఉంది. మొత్తం మీద ఫస్ట్ గేర్ టీజర్ ఈ చిత్రంపై ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమాకు అన్వర్ అలీ ఎడిటర్ గా, క్రాంతి ప్రియమ్ ప్రొడక్షన్ డిజైనర్ గా, సత్యం రాజేష్, విద్యాసాగర్ జె ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ గా వ్యవహరిస్తున్నారు. 'మెకానిక్ రాకీ' చిత్రం దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## తాప్సి పారిస్ పరువం చీరలో నెవ్వర్ బిఫోర్

ఒకప్పుడు సౌత్ లో స్టార్ హీరోయిన్ గా ఒక వెలుగు వెలిగిన తాప్సి తరువాత బాలీవుడ్ లోకి అడుగుపెట్టి అక్కడ కూడా స్టార్ యాక్టర్ గా వరుస సినిమాలు చేస్తోంది. ఫీమేల్ సెంట్రిక్ కథలకి తాప్సి కేరాఫ్ అడ్రెస్ గా ఉంటుంది. బయోపిక్ లు కూడా ఎక్కువగా చేస్తోంది. మిథాలీ రాజ్ బయోపిక్ లో ఆమె నటించింది. గత ఏడాది షారుఖ్ ఖాన్ డంకీ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆ మూవీ పర్వాలేదనే టాక్ తెచ్చుకుంది. ఆగష్టులో తాప్సి నుంచి రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకి రానున్నాయి. హసీనా దిల్ రుబాకి సీక్వెల్ గా తెరకెక్కిన ప్యార్ అవి హసీనా దిల్ రుబా మూవీ ఆగష్టు 9న థియేటర్స్ లోకి వస్తోంది. విక్రాంత్ మెస్సీ ఈ సినిమాలో తాప్సికి జోడీగా నటిస్తున్నాడు. ఆగష్టు 15న ఖేల్ ఖేల్ మెయిన్ అనే మూవీ థియేటర్స్ లోకి రాబోతోంది. ఈ మూవీ కథ పారిస్ నేపథ్యంలో ఉండబోతోంది. హాలీవుడ్ మూవీ పెర్ఫెక్ట్ స్ట్రేంజర్స్ కి రీమేక్ గా ఈ సినిమా తెరకెక్కింది. అక్షయ్ కుమార్, తాప్సి, వాణి కపూర్ లాంటి స్టార్ యాక్టర్స్ ఈ



చిత్రంలో నటించారు. ఇదిలా ఉంటే తాజాగా తాప్సి ఇన్ స్టాగ్రామ్ లో పారిస్ లో దిగిన ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసుకుంది. బ్లాక్ శారీలో ఈ అమ్మడు హొటల్ లో దిగిన పిక్ ని పంచుకుంది. అలాగే పారిస్ రోడ్లు మీద హ్యాపీ రిఫ్రెష్ అవుతూ ఉన్న ఫోటోలు, వీడియోస్ ని పంచుకుంది. వీటిని షేర్ చేయడంతో పాటు ఖేల్ ఖేల్ మెయిన్ మూవీ ట్రైలర్ కి పబ్లిక్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోందని పోస్ట్ పెట్టింది. ఇంత మంచి రెస్పాన్స్ అందించిన ప్రేక్షకులకి థాంక్స్ తెలియజేసింది. పారిస్ లో ఈ సినిమా చాలా అందంగా, లవ్ లీగా తెరకెక్కిందని పేర్కొంది. అలాగే ప్రేమ, కామెడీ కలగలిసి మూవీ ఉంటుందని మెన్షన్ చేసింది. నేను కట్టుకున్న చీర ఏదో చెబుతోంది అంటూ ఇన్ స్టాగ్రామ్ లో రాసుకొచ్చింది. తాప్సి షేర్ చేసిన ఫోటోలకి నెటిజన్లు నుంచి ఇంటరెస్టింగ్ కామెంట్స్ వస్తున్నాయి. వారం రోజుల గ్యాప్ లో తాప్సి నుంచి ఈ నెలలో రెండు సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. ఆగష్టు 1న తాప్సి బర్త్ డే కావడం ఆమె తన పుట్టినరోజు వేడుకల్ని పారిస్ లో చేసుకున్నట్లు ఈ ఫోటోల బట్టి తెలుస్తోంది. నెటిజన్లు ఆమెకి బర్త్ డే విషెస్ తెలియజేస్తున్నారు.

## ఎర్ర ఫ్రాకులో కుర్ర బ్యూటీ గుండెలు దడదడ

బాలీవుడ్ లో నటవారసురాళ్ల హవా గురించి తెలిసినదే. ఇటీవల 'ది ఆర్చీస్' వెబ్ సిరీస్ తో నలుగురు నటవారసులు రంగ ప్రవేశం చేయగా, కింగ్ ఖాన్ షారూఖ్ వారసురాలు సుహానా ఖాన్ అందులో ఒకరు. సుహానా తదుపరి పాపా షారూఖ్‌తో కలిసి భారీ యాక్షన్ అడ్వెంచర్ లో నటిస్తోంది. మరోవైపు సుహానా తన ఫ్యాషన్ గేమ్‌ని పూర్తిగా మార్చేసింది. ఇటీవల తనలోని హాలి యాంగిల్ ని ప్రదర్శించేందుకు ఈ అప్ కమింగ్ బ్యూటీ ఏమాత్రం సంకోచించడం లేదు. నిరంతరం వేడెక్కించే ఫోటోషూట్లతో అంతర్జాలంలో అగ్గి రాజేస్తోంది. సుహానా తాజాగా రెడ్ హాట్ డ్రెస్‌లో వీకెండ్ వైబ్స్‌ని ప్రదర్శించిన తీరు ఆకట్టుకుంది. ఈ బ్యూటీ ఇప్పటికి వన్ ఫిలిం వండర్. కానీ జెన్ జెడ్ ఫ్యాషన్ ఐకాన్ గా యూత్ లో వెలిగిపోతోంది. ఇటీవలి ఫోటో షూట్ కోసం ఖాన్ డాటర్ డేవిడ్ కోమా రెడ్ డ్రెస్‌లో డేట్ నైట్ ని ప్లాన్ చేసింది. ఈ దుస్తులలో స్పఘెట్టి పట్టీలు ప్రత్యేకంగా ఆకర్షించాయి. సుహానా రెడ్ ఫ్రాకులో హొయలు పోతూ ఫోటోగ్రాఫర్లకు ఫోజులిచ్చిన వైనం నెట్ లో అగ్గి రాజేస్తోంది.



యువతరం వాట్సాపుల్లో ఈ ఫోటోలు వైరల్ గా మారుతున్నాయి. సుహానా తండ్రికి తగ్గ తనయగా నటనారంగంలో సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. దానికి తగ్గట్టే యూత్ కి కిక్కిచ్చే ఫోటోషూట్లతో విరుచుకుపడుతోంది. సోషల్ మీడియాల్లో ఈ భామకు భారీగా ఫాలోయింగ్ పెరుగుతోంది. ఇంతకుముందు సుహానా ఖాన్ 22వ పుట్టినరోజున అభిమానులకు చిక్ మినీ డ్రెస్‌తో ట్రీట్ ఇచ్చింది. అప్పుడు పసుపు రంగులో సింగిల్ షోల్డర్ పట్టీ డ్రెస్ లో మతులు చెడగొట్టింది. పాపులర్ మనీష్ మల్హోత్రా సహా టాప్ డిజైనర్లు ఖాన్ డాటర్స్ కోసం ప్రత్యేకంగా దుస్తులను డిజైన్ చేస్తున్నారు. ఈ దుస్తుల్లో సుహానా ప్రమోషన్ వండర్ ఫుల్. నటిగా ఖాన్ లోని చిలిపిదనాన్ని వెండితెరపైకి తేవడంలో సఫలమైతే ఈ బ్యూటీ గేమ్ డిఫరెంటుగా ఉంటుందనడంలో సందేహం లేదు. షారూఖ్– సుహానా ప్రధానపాత్రల్లో సుజోయ్ ఘోష్ దర్శకత్వంలో భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉన్న సంగతి తెలిసిందే. త్వరలోనే సెట్స్ పైకి వెళ్లనున్నారు.



## ఖమ్మం వరద బాధితులకు రూ. కోటి విరాళం అందజేసిన ఎంపీ పార్థసారథి రెడ్డి

హైదరాబాద్ : రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జన జీవనం స్తంభించిపోయింది. భారీ వర్షాలకు పలు చోట్ల చెట్లు, కరెంట్ స్తంభాలు నేలకొరిగాయి.

పంటలు దెబ్బతిన్నాయి. ఈ వరదలకు అనేక మంది ప్రజలు ఇళ్లను కోల్పోయి నిరాశ్రయులయ్యారు. ముఖ్యంగా జిల్లాలో వరుణుడు బీభత్సం సృష్టించాడు. ఈ క్రమంలో ఖమ్మం వరద బాధితులను ఆదుకునేందుకు తన వంతు సాయంగా హెటిరో డ్రగ్స్ అధినేత, బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ బండి పార్థసారథి రెడ్డి కోటి రూపాయల విరాళం ప్రకటించారు. కోటి రూపాయల చెక్కును జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. లక్షలాది విలువచేసే మందులు వితరణ చేశారు. అలాగే వారం రోజులు పాటు ఖమ్మంలోనే సింధు హాస్పిటల్ డాక్టర్లు సేవలు అందిస్తారని ఆయన తెలిపారు.

## గురువులకు మద్దతుగా పిడికిలెత్తిన గురుకుల విద్యార్థులు.. హరీశ్‌రావు ట్వీట్

హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో పని చేస్తున్న పార్ట్‌టైమ్ టీచర్లను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సీరియస్‌గా స్పందించారు.

ఇక గౌలిదొడ్డి గురుకుల పాఠశాలలో తొలగించిన ఫ్యాకల్టీని మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని విద్యార్థులు పిడికిలి బిగించడం అభినందనీయం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున తమ గురువులను సన్మానించుకునే సంబరాల్లో మునిగి తేలాల్సిన విద్యార్థులను రేవంత్ ప్రభుత్వం చదువులు మానేసి ధర్నాలకు దిగేలా చేయడం దురదృష్టకరం అని హరీశ్‌రావు అన్నారు. తమ గురువులకు మద్దతుగా గురుకుల విద్యార్థులు పిడికిలి బిగించడం అభినందనీయమన్నారు. ఐఐటి, ఎన్ఐటి, నీట్ వంటి జాతీయస్థాయి పరీక్షల్లో విద్యార్థులు ర్యాంకులు సాధించేలా వెన్నంటి నిలిచిన గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఉపాధ్యాయులను నిర్దాక్షిణ్యంగా తొలగించడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు.

విద్యా సంవత్సరం మధ్యలో 6200 మంది గురుకుల ఉపాధ్యాయులను తొలగించిన మీ నిర్ణయం వల్ల ఈరోజు వేలమంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం భేషజాలకు పోకుండా ఉద్యోగాల నుంచి తీసేసిన గురుకుల టీచర్లను తక్షణమే విధుల్లోకి తీసుకుని విద్యార్థుల భవిష్యత్ కాపాడాలి. తమ పిల్లల భవిష్యత్తు గురించి కలలుగన్న తల్లిదండ్రులకు ఏమని సమాధానం చెబుతారు రేవంత్ రెడ్డి? అని హరీశ్‌రావు నిలదీశారు.

## ఎస్సారెస్పీకి భారీ వరద.. 41 వరద గేట్ల ద్వారా నీటి విడుదల

హైదరాబాద్ : శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్‌కు భారీ వరద కొనసాగుతున్నది. ఎగువ మహారాష్ట్ర, గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు ఎస్సారెస్పీకి భారీగా వరద వస్తోంది. ప్రస్తుతం 2 లక్షల 25 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండడంతో 3లక్ష 24వేల క్యూసెక్కుల ఔట్ ఫ్లోను 41 వరద గేట్ల ద్వారా దిగువకు వదులుతున్నారు. ఎస్సారెస్పీలో గరిష్ఠ నీటిమట్టం 1,091 అడుగులు కాగా 1,089 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం 73.458 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. కాగా, భారీ వర్షాల నేపపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకి రావొద్దని అధికారులు హెచ్చరించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ అవసరం వచ్చినా అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.



## చెరువు కట్టలు, కాల్వల మరమ్మతులకు టెండర్లు: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: భారీ వర్షాలకు తెగిపోయిన చెరువు కట్టలు, కాల్వల మరమ్మతుల కోసం వారం రోజుల్లో టెండర్లు పిలవాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాలతో తలెత్తిన పరిస్థితులు, తీసుకోవాల్సిన చర్యలు, వర్ష సూచన నేపథ్యంలో ముందు జాగ్రత్తలపై మంత్రి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వెంటనే పాలనాపరమైన అనుమతులు తీసుకొని శుక్రవారం ఉదయానికి ఆన్‌లైన్‌లో టెండర్లు అప్‌లోడ్ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

వర్షాల్లోనూ విధుల్లో నిమగ్నమై పనిచేసిన నీటిపారుదల శాఖ సిబ్బందిని అభినందించారు. "క్షేత్ర స్థాయిలో నేను పర్యటించినప్పుడు రెగ్యులేటర్‌లు, షట్టర్లు పనిచేస్తున్నాయా? లేదా? అని అధికారులు పరిశీలిస్తున్నట్టు కనిపించలేదు.

నిరంతర పర్యవేక్షణ లేకపోతే విపత్తులు సంభవించినప్పుడు దుష్పరిణామాలు చోటు చేసుకుంటాయి. ఒక దగ్గర రెగ్యులేటర్ జామ్ అయింది. మరోచోట షట్టర్ ఎత్తుతుంటే తెగిపోయింది. ఈ తరహా ఘటనలు పునరావృతం అయితే ఉపేక్షించబోం. మరోమారు అటువంటి ఘటనలు చోటుచేసుకుంటే చీఫ్ ఇంజినీర్లే బాధ్యత వహించాల్సి ఉంటుంది"అని ఉత్తమ్ స్పష్టం చేశారు.



## ఆదిలాబాద్ ఎమ్మెల్యే గృహ నిర్బంధం

ఆదిలాబాద్ కలెక్టరేట్: భాజపాకు చెందిన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను పోలీసులు గృహనిర్బంధం చేశారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ ఆదివాసీ మహిళపై ఓ వర్గానికి చెందిన వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. దీంతో ముందస్తు చర్యల్లో భాగంగా ఎమ్మెల్యేను గృహనిర్బంధం చేసి, ఆయన ఇంటి చుట్టూ పోలీసులు మొహరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇతర ప్రాంతాల్లో మహిళలపై అత్యాచారాలు జరిగితే గళమెత్తే ఓవైసీ సోదరులు ఆదివాసీ మహిళపై అఘాయిత్యం జరిగితే ఎందుకు భిన్నంగా స్పందిస్తున్నారని ధ్వజమెత్తారు. రోహింగ్యాలు, పాకిస్థానీయులు ఇక్కడకు వచ్చి తలదాచుకుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. జైనూర్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



## ఎయిర్ పోర్టులకు దీటుగా అమృత్ భారత్ స్టేషన్లు.. - రైల్వే సహాయమంత్రి సోమన్న



హైదరాబాద్ సిటీ: అమృత్ భారత్ ప్రాజెక్టుల ద్వారా రైల్వేస్టేషన్లను ఎయిర్‌పోర్టులకు దీటుగా అభివృద్ధి చేస్తున్నట్లు రైల్వే సహాయ మంత్రి సోమన్న తెలిపారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేక రైల్లో కాచిగూడ యాకత్‌పురా, ఉప్పుగూడ మీదుగా ఉందానగర్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న మంత్రి సోమన్న.. అక్కడ అమృత్ భారత్ ప్రాజెక్టు ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బాసర, నిజామాబాద్, మల్కాజిగిరి, యాకత్‌పుర, ఉప్పుగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్లను అమృత్ భారత్ ప్రాజెక్టు ద్వారా పూర్తిగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే అమృత్ భారత్ స్టేషన్ల లక్ష్యమన్నారు. ఆయా స్టేషన్లలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి సోమన్న శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లి, అక్కడి నుంచి ఢిల్లీ వెళ్లిపోయారు. రైల్వే మంత్రి వెంట దక్షిణమధ్యరైల్వే ఏజీఎం నీరజ్ అగర్వాల్, హైదరాబాద్ డీఆర్ఎం లోకేష్ వైష్ణవ్ తదితరులున్నారు.

## ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే ప్రవేశాలు.. స్థానికత వివాదంపై హైకోర్టు తీర్పు



హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కళాశాలల్లో మెడికల్, డెంటల్ కోర్సుల్లో అడ్మిషన్లకు సంబంధించి స్థానికత వివాదంపై పూర్తిస్థాయి వాదనలను విన్న హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. స్థానికులంతా స్థానిక కోటా కింద అర్హులేనని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టత ఇచ్చింది. స్థానికులు ఎవరనే అంశంపై సరైన మార్గనిర్దేశకాలు లేవని ధర్మాసనం అభిప్రాయపడింది. స్థానికత నిర్ధరణకు సరైన మార్గదర్శకాలు రూపొందించాలని ప్రభుత్వానికి ఆదేశించింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే ప్రవేశాలు కల్పించాలని హైకోర్టు తీర్పు వెలువరించింది. కాళోజీ నారాయణరావు వైద్య యూనివర్సిటీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని ఆదేశించింది. మెడికల్ అడ్మిషన్ల నిబంధనలను సవరిస్తూ రూల్ '3ఏ'ను చేరుస్తూ ప్రభుత్వం జీవో 33ను జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం విచారణ కొనసాగించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు బి.మయూర్‌రెడ్డి, డి.వి.సీతారాంమూర్తి తదితరులు వాదనలు వినిపించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనల సవరణ వల్ల స్థానికులకే ఎక్కువ నష్టం వాటిల్లుతోందన్నారు. ఇతర రాష్ట్రాలవారితోపాటు భారతీయ మూలాలున్న ప్రవాసులు ఇక్కడ 4 ఏళ్లు చదువుకుంటే 85 శాతం స్థానిక కోటా కింద అవకాశం దక్కించుకుంటారన్నారు. దీనివల్ల తెలంగాణలో పుట్టిపెరిగిన వారికి నష్టం వాటిల్లుతుందన్నారు. స్థానిక కోటా ఇక్కడ నివాసం ఉన్నవాళ్లకే అడుగుతున్నామని, చదువుకున్నవారు అన్న దానిపై అడగడం లేదన్నారు. ఉద్యోగులు బదిలీ కావడం వంటి పరిస్థితుల్లోనూ.. అలాగే మెరుగైన విద్య కోసం.. ఇంటర్ మరో రాష్ట్రంలో చదువుకున్న తెలంగాణ విద్యార్థి స్థానికుడు కాదనడం సరికాదన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ ఉద్యోగుల పిల్లలకు అవకాశం ఇస్తామన్న ప్రభుత్వం.. ప్రైవేటు ఉద్యోగుల పిల్లలకు అవకాశం నిరాకరించడం వివక్ష చూపడమేనన్నారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరగకూడదన్న ఉద్దేశంతోనే ఈ జీవో తీసుకువచ్చినట్లు తెలిపారు. నిబంధనలు తీసుకువచ్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని తెలిపారు. ఈ వివాదానికి సంబంధించి ఇరుపక్షాల వారు పలు సుప్రీంకోర్టు, హైకోర్టుల తీర్పులను ధర్మాసనం ముందుంచారు. వాదనలను విన్న ధర్మాసనం ఇవాళ తీర్పు వెలువరించింది.



## తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద ప్రవాహం.. 15 గేట్లు ఎత్తి నీటి విడుదల

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు మధ్యంతర ప్రాజెక్టుకు మళ్లీ వరద పోటెత్తుతోంది. జలాశయం ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌లో కురిసిన వర్షాలకు భారీగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 15 గేట్లు ఎత్తి 46 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

తాలిపేరుతో పాటు చింతవాగు, రోటెంత వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఏఈ ఉపేందర్ ప్రాజెక్టు వద్దకు చేరుకొని వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

## ప్రతిపక్షాలను తిట్టడానికి ఒక మంత్రిని పెట్టుకోండి : నిరంజన్ రెడ్డి



హైదరాబాద్ : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చేరికలకు ఒక ప్రత్యేక మంత్రిగా రెవెన్యూ మంత్రిని పెట్టింది.. ప్రతిపక్షాలను తిట్టడానికి ఒక మంత్రిని పెట్టుకోండి అని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి సూచించారు. తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ కంటే గొప్పగా చేస్తారని ప్రజలు మీకు అవకాశం ఇచ్చారు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చి నమ్ముకున్న జనాలను నిలువునా ముంచారు. మిషన్ కాకతీయలో చెరువులు సరిగ్గా చేయలేదని ఆరోపించడం విడ్డూరం.. ఏం చేయనిదే ఇన్నేళ్లలో భూగర్భజలాలు పెరిగాయా? పరామర్శకు వెళ్లిన సీఎం జీపులో నిలబడి చేయి ఊపి వెళ్తారా అని ప్రజలు విమర్శిస్తున్నారు.. చావుకు, పెళ్లికి ఒకేలా వ్యవహరించడం సీఎంకు అలవాటుగా మారిందని నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి ప్రణాళిక లేక వట్టెం పంప్ హౌస్ నీట మునిగింది. ముఖ్యమంత్రి అయి 9 నెలలు అయినా పాలమూరు బిడ్డగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలను చూడలేదు. నీటి పారుదల శాఖా మంత్రి ఇంత వరకు అటువైపు కన్నెత్తి చూడలేదు. పెండింగ్ పనులను పూర్తి చేసి నీళ్లను మలుపుకుందామన్న సోయి ప్రభుత్వానికి లేదు. చిల్లర చేష్టలు, చిల్లర మాటలతో ప్రతిపక్షాన్ని తిట్టి హామీల అమలు విషయాన్ని దృష్టి మళ్లిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు.




## పంట పొలాల్లో అత్యవసరంగా ల్యాండ్ అయిన ఆర్మీ హెలికాప్టర్

నల్లగొండ : నల్లగొండ జిల్లాలోఆర్మీ హెలికాప్టర్ అత్యవసరంగా ల్యాండ్ అవడం స్థానికంగా కలకలం రేపింది. చిట్యాల పట్టణ శివారులోని వనిపాకల గ్రామంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ హెలికాప్టర్ ల్యాండ్ అయింది. దీంతో స్థానికులు ఒక్కసారిగా అయోమయానికి గురయ్యారు. వారం క్రితం జైపూర్ నుంచి విజయవాడలో వరద భాదితుల కోసం సహాయ చర్యలకు వెళ్లిన ఆర్మీ హెలికాప్టర్ సహాయక చర్యలు ముగించుకుని జైపూర్ వెళ్తుండగా సాంకేతిక లోపంతో అత్యవసర ల్యాండ్ అయినట్లు తెలిసింది. కాగా, హెలికాప్టర్‌లో ఉన్న పైలట్‌తో సహా మరో ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి సహకరించాలి - జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

హైదరాబాద్ సిటీ: స్పెషల్ సమ్మరి రివిజన్- 2025 ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో తప్పులు లేకుండా తయారు చేయడానికి రాజకీయ పార్టీలు సహకరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు జాబితాలో నమోదుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు అర్హులైన వారు ఓటరు జాబితాలో పేరు నమోదు కాని వారు ఓటరుగా నమోదు చేసుకొనే వెసులుబాటును ఎన్నికల కమిషన్ కల్పించిందని తెలిపారు. ఓటరు జాబితాలో తప్పుల సవరణ, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ కోసం, పోలింగ్ స్టేషన్ సరిహద్దులు సరిచేయడానికి బీఎల్ఓలు ఇంటి ఇంటి సర్వేను అక్టోబరు18 వరకు పూర్తి చేయనున్నట్లు వివరించారు. "సమగ్ర డ్రాఫ్ట్ రోల్స్ కోసం, ఓటరు నమోదు, మార్పులు చేర్పుల కోసం ఫారం 1-8 తయారి అక్టోబర్ 19నుంచి28 వరకు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఓటరు జాబితా పబ్లికేషన్ అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28 వరకు క్లెయిమ్ అండ్ అబ్జెక్షన్, క్లెయిమ్ అండ్ అబ్జెక్షన్ పరిష్కారం డిసెంబర్ 24 వరకు అవకాశం ఉంది. జనవరి 6న తుది జాబితా ప్రచురించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయా పార్టీల ప్రతినిధులు సూచనలను పరిశీలించి తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేయనున్నారు" అని కమిషనర్ ఆమ్రపాలి పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రతినిధి కృష్ణ దాస్, ఎంఐఎం ప్రతినిధి సయ్యద్ ముస్తఫా, బీఎస్పీ ప్రతినిధి కె. నరేందర్ కుమార్, బీజేపీ ప్రతినిధులు వీఎస్ భరద్వాజ్, మర్రి శశిధర్ రెడ్డి, కె.పవన్‌కుమార్, సీపీఎం నాయకులు శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు నిరంజన్, రాజేష్ కుమార్ తదితర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com